విశాలాంధ్ర

కృష్ణా, ఎన్టీఆర్
గుంటూరు, పల్నాడు

మంగళవారం 08 అక్టోబరు 2024 8 పేజీలు

పలస్తీనాకు అండగా వామపక్షాలు

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : గత సంవత్సరకాలంగా జరుగుతున్న మారణహోమంలో విలవిలలాడిపోతున్న పాలస్తీనాకు వామపక్షాలు అండగా నిలుస్తాయని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, సీపీఐ(ఎంఎల్) నాయకులు ఉల్లిగడ్డల నాగేశ్వరరావు, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు వి.నరసింహారావు, ప్రజాపోరు నాయకులు కోటేశ్వరరావు తెలిపారు. పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను వెంటనే నిలిపివేయాలని, యుద్ధాన్ని ప్రోత్సహించే అమెరికా చర్యలను ప్రపంచ దేశాలు నిరసించాలని వారు -మిగతా 2 లో ...

నేటి అలంకారం
శ్రీమహాలక్ష్మీదేవి



విశాలాంధ్ర -విజయవాడ (వన్ టౌన్): శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శ్రీకనకదుర్గమ్మవారు శ్రీమహాలక్ష్మీదేవిగా దర్శనమిస్తారు. మంగళప్రదమైన దేవత ఈ మహాలక్ష్మీదేవి జగన్మాత మహాలక్ష్మీ స్వరూపంలో దుష్టరాక్షససంహారాన్ని చేయటం ఒక అదు్భతఘట్టము. మూడు శక్తుల్లో ఒక శక్తి అయిన శ్రీమహాలక్ష్మి అమితమైన పరాక్రమాన్ని చూపించి, హాలుడు అనే రాక్షసుడిని సంహరించింది. లోకస్థితి కారిణిగా ధన, ధాన్య, ధైర్య, విజయ, విద్య, సౌభాగ్య, సంతాన, గజలక్ష్ములుగా వరాలు ప్రసాదించే అష్టలక్ష్మి సమిష్టిరూపమైన అమృతస్వరూపిణిగా శ్రీదుర్గమ్మ మహాలక్ష్మీ దేవిగా భక్తులను అనుగ్రహిస్తుంది.

ప్రభుత్వ ఆసుపత్రిలో కాంట్రాక్టర్ నిలువు దోపిడి

ఏఐటీయూసీ కృష్ణా జిల్లా కన్వీనర్ టి.తాతయ్య

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : కృష్ణాజిల్లా మచిలీపట్నం సర్వజన ప్రభుత్వ ఆసుపత్రిలో కాంట్రాక్ట్ కార్మికుల శ్రమను దోచుకొని తమకు అన్యాయం చేసాడని కాంట్రాక్ట్ కార్మికులు వాపోతున్నారని ఏఐటీయూసీ కృష్ణా జిల్లా కన్వీనర్ టి.తాతయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపి మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) మచిలీపట్నం ఆధ్వర్యంలో మచిలీపట్నం -మిగతా 2 లో ...

అత్యంత నాణ్యతా ప్రమాణాలతో
లడ్డూ, అన్నప్రసాదాలు

భక్తుల రద్దీ దృష్ట్యా అవసరమైన లడ్డూలు సిద్ధంగా ఉంచాం... ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన

విశాలాంధ్ర-విజయవాడ: అత్యంత నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ అమ్మవారి లడ్డూ, అన్న ప్రసాదాలను తయారు చేయడంతో పాటు భక్తుల రద్దీని ద ృష్టిలో పెట్టుకొని ఎప్పటికప్పుడు అవసరమైన లడ్డూలను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. స ృజన తెలిపారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా విజయవాడ బ్రాహ్మణ వీధిలో నిర్వహిస్తున్న లడ్డూ ప్రసాద తయారీ కేంద్రం (లడ్డూ పోటు), అన్న ప్రసాద తయారీ కేంద్రాలను కలెక్టర్ స ృజన సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భక్తులకు అత్యంత ప్రీతిపాత్రమైన అమ్మవారి లడ్డు ప్రసాదాల తయారీలో అత్యంత నాణ్యత ప్రమాణాలను పాటించేలా చర్యలు తీసుకున్నామన్నారు. లడ్డూ పోటు,అన్న ప్రసాద తయారీకి వినియోగించే -మిగతా 2 లో ...

పేకాటడిన ఖాకీ బాస్‌లు!

వివరాలు 3లో..

ధరలను అరికట్టకపోతే .. ప్రజానిరసన

వివరాలు 8లో..

ప్రజల ఫిర్యాదులు పరిష్కరించాలి

విశాలాంధ్ర-నరసరావుపేట: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కు వచ్చే ప్రతీ ఫిర్యాదు పరిష్కారం కావాలని పల్నాడు జిల్లా కలెక్టర్ పి అరుణ్‌బాబు జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం కలెక్టర్ అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ లతో కలిసి ప్రజల నుండి వినతులను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. జిల్లాలోని సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన 104 మంది అర్జీదారులు తమ వినతులను జిల్లా కలెక్టర్, ఇతర అధికారులకు అందించారు. ఈ సందర్భంగా -మిగతా 2 లో ...

చిరువ్యాపారుల తొలగింపు అమానుషం

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద అనేక మంది పేదలు చిరువ్యాపారాలను ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారని, అటువంటి చిరువ్యాపారులను తొలగించడం అమానుషమని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు కోట మాల్యాద్రి అన్నారు. గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల వద్ద తొలగించిన చిరువ్యాపారులను అక్కడే కొనసాగించాలని కోరుతూ కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజకు సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కోట మాల్యాద్రి మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా ప్రభుత్వ ఆసుపత్రి వద్ద వ్యాపార లావాదేవీలు నిర్వహించుకుంటూ వారి కుటుంబాలను పోషించుకుంటూ,ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే రోగులకు తక్కువ ధరలో తినుబండాలను చిరువ్యాపారులు సరఫరా చేస్తుంటారని -మిగతా 2 లో ...

ఉచిత ఇసుక సరఫరాకు చర్యలు

కృష్ణా జిల్లా కలెక్టర్ డీకె. బాలాజీ

విశాలాంధ్ర బ్యూరో-మచిలీపట్నం : జిల్లాలోని వినియోగదారులకు ఉచిత ఇసుక అందిచేందుకు టెండర్ ప్రక్రియ ద్వారా ఏజెన్సీని గుర్తించి ఖరారు చేయాలని, అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకె. బాలాజీ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ అద్యక్షతన సోమవారం కలెక్టర్ చాంబర్‌లో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రీచ్‌లలో ఇసుక తవ్వి వాహనముల ద్వారా సమీపంలోని -మిగతా 2 లో ...

సీపీఐ నాయకులు బత్తులకి నివాళులు

విశాలాంధ్ర-విజయవాడ/ గుంటూరు : విజయవాడ నగర కమ్యూనిస్టు పార్టీ మాజీ కార్యవర్గ సభ్యులు ఏపీఎస్ ఆర్టీసీ రాష్ట్ర నాయకులు బత్తుల వెంకటేశ్వరరావుకి సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు నివాళులర్పించారు. సోమవారం నరసరావుపేటలో వెళ్లి వెంకటేశ్వరరావు మృతదేహానిపై పార్టీ జెండా కప్పి శ్రద్ధాంజలి ఘటించారు. కోటేశ్వరరావుతో పాటు సీపీఐ నగర సహాయ కార్యదర్శి లంక దుర్గారావు, కార్యదర్శి వర్గ సభ్యులు పంచదార్ల దుర్గాంబ, ఏఐటీయూసీ నగర అధ్యక్షులు కేఆర్. ఆంజనేయులు, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎన్‌సీహెచ్ చక్రవర్తి, ఆర్టీసీ రిటైర్డ్ అసోసియేషన్ ప్రాంతీయ కార్యదర్శి కేవీ చలపతి, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ఆర్ కృష్ణ ,డిపో కార్యదర్శి టి.వేణు నాయకులు,ఎస్.కె మొహిద్దిన్, ఆదినారాయణ, వి. శ్రీనివాసరావు, ఎంపీసీహెచ్ రావు తదితరులు శ్రద్ధాంజలి ఘటించారు.

(మొదటి పేజీ తరువాయి)

పలస్తీనాకు అండగా వామపక్షాలు

పిలుపునిచ్చారు. పాలస్తీనాపై ఇజ్రాయిల్ జరుపుతున్న పాశవికదాడులను వ్యతిరేకిస్తూ గుంటూరు కింగ్ హోటల్ ప్రధాన రహదారి వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో సోమవారం సంఘీభావ దినాన్ని పాటిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇజ్రాయిల్ జరుపుతున్న దాడులలో 85 వేల మంది అమాయకులు మరణించారని, వారిలో చిన్నారులు, మహిళలు, వృద్ధులు ఉండటం శోచనీయమని అన్నారు. యుద్ధం కారణంగా వేలాది మంది క్షతగాత్రులయ్యారని, లక్షలాది మంది నిరాశ్రయులయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికా నాయకత్వంలో ఇజ్రాయిల్‌కు ఆయుధాలు సరఫరా చేస్తూ యుద్ధం మరింత పెరగడానికి కారణమయ్యారని అన్నారు. అమెరికా తన సామ్రాజ్యవాద కాంక్షను ఇజ్రాయిల్ రూపంలో తీర్చుకుంటుందని విమర్శించారు. అమెరికా అండ చూసుకుని ఎగిరెగిరిపడుతున్న ఇజ్రాయిల్‌కు నాటో దేశాలు అండగా నిలబడుతున్నాయని మండిపడ్డారు. హమాస్ సంస్థను లక్ష్యంగా చేసుకుని కీలక నాయకులను మట్టుపెట్టే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. శాంతి నెలకొల్పాలని ఐక్యరాజ్యసమితి చెప్పినప్పటికీ దానిని పెడచెవిన పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లౌకికవాద శక్తులంగా, సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తులంగా పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం నగర కార్యదర్శులు కోట మాల్యాద్రి, కె.నళినీ కాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఇజ్రాయేల్‌ది సామ్రాజ్యవాద దురహంకారం

విశాలాంధ్ర-విజయవాడ: ఒక జాతిని అంతం చేయాలనే ఉద్ధేశ్యంతో పలస్తీనాపై దాడి చేసి వేలమందిని పొట్టనబెట్టుకున్న ఇజ్రాయిల్‌ది సామ్రాజ్యవాద దురహంకారమని ప్రపంచ చరిత్రలో సామ్రాజ్యవాద యుద్ధాలు ఇప్పటి వరకు విజయం సాధించలేదని పలువురు వక్తలు అన్నారు. సంగమం ఆధ్వర్యంలో స్థానిక లెనిన్ సెంటర్‌లో పలస్తీనా సంఘీభావ సభ జరిగింది. కందుకూరి తాజారావు అధ్యక్షతన లెనిన్‌విగ్రవద్ద సోమవారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సామ్రాజ్యవాద దేశాల దాడిని ఖండిస్తూనే ఇజ్రాయిల్ చేస్తున్న దురాగతాలను ఖండించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బుడ్డిగ జమిందార్, జమాతే ఇస్లామీ నాయకులు ముషేహద్ బేగ్, దివికుమార్, ఖనితసల్మా, విశ్రాంత ఇంజనీరు కె.శ్రీమన్నారాయణ, డాక్టర్ సురేష్, షేక్ ఫర్హత్, ఏపీటీఎఫ్ నాయకులు పాండురంగవరప్రసాద్, తదితరులు ప్రసంగించారు. ఎంసీపీఐ నాయకులు సలీమ్ వందన సమర్పణ చేశారు.

చిరువ్యాపారుల తొలగింపు అమానుషం

అన్నారు. గుంటూరు నగరపాలక సంస్థ ద్వారా పొందిన స్ట్రీట్ వెండింగ్ కార్డులు, ఐడీ కార్డులతో క్రమశిక్షణతో ప్రజలు, రోగులకు సేవలు అందిస్తున్న వారిని తొలగించడం అమానుషమని అన్నారు. స్పందించిన జేసీ తగు చర్యలకు కలెక్టర్, ఎస్పీలకు పంపుతానని తెలియజేయడం జరిగిందని మాల్యాద్రి తెలియజేశారు. అలాగే నగరపాలక సంస్థ గ్రీవెన్స్, ఎస్పీ గ్రీవెన్స్‌లో కూడా వినతిపత్రాలు అందజేయడం జరిగిందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో చిరువ్యాపారుల సంఘం నాయకులు దూపాటి వెంకటరత్నం, నరసింహారావు, బాబు, జమీల్, శ్రీనివాసరావు, ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి చల్లా మరియదాసు, సీపీఐ సీనియర్ నాయకులు నూతలపాటి వెంకటేశ్వరరావు, లలితమ్మ, లక్ష్మి, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఫిర్యాదులు పరిష్కరించాలి

కలెక్టర్ మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కారం అవుతాయానే నమ్మకంతో నలుమూల ప్రాంతాల నుంచి అర్జీదారులు ఇక్కడకి వస్తుంటారని అన్నారు. అటువంటి వారి సమస్యలను సావధానంగా విని, సత్వర పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమస్యకు నాణ్యమైన పరిష్కారం చూపాలని, ఆ పరిష్కారంతో అర్జీదారు సంత ృప్తి చెందాలని సూచించారు.ఇందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి పరిష్కారం చూపాలని ఉద్బోదించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్, ఇతర జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అత్యంత నాణ్యతా ప్రమాణాలతో లడ్డూ, అన్నప్రసాదాలు

ముడి సరుకులు, ద్రవ్యాలను పరిశీలించడం జరిగిందన్నారు. నవరాత్రి ఉత్సవాలలో 25 లక్షల లడ్డూలు విక్రయించే అవకాశం ఉందన్నారు. మూలా నక్షత్రం రోజున భక్తుల సంఖ్య అసాధారణ స్థాయిలో ఉంటుందన్నారు. అదే సమయంలో లడ్డూ ప్రసాదానికి కూడా డిమాండ్‌కి పెరుగుతుందని, దీన్ని దృష్టిలో పెటుకొని రెండున్నర నుంచి మూడు లక్షల లడ్డూలను సిద్ధం చేసేలా చర్యలు తీసుకుంటున్నా మన్నారు. అవసరమైతే ప్రసాద విక్రయ కేంద్రాలను అప్పటికప్పుడు పెంచేందుకు దేవస్థానం సిబ్బంది సిద్ధంగా ఉన్నారని వివరించారు. లడ్డు పోటు, అన్న ప్రసాద తయారీ కేంద్రాల తనిఖీలలో కలెక్టర్ వెంట ఆలయ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎల్. రమ, ఏ.ఈ.ఓ. పి.చంద్రశేఖర్, సూపరింటెండెంట్ వై. హేమదుర్గ, సిబ్బంది కే. సీతారామయ్య, జగన్నాధ:రావు, ఆదినారాయణ, ఎస్‌కేడీ కృష్ణ తదితరులు ఉన్నారు.

ఉచిత ఇసుక సరఫరాకు చర్యలు

స్టాక్‌యార్డ్‌లకు చేర్చడం, రవాణా నిమిత్తం ర్యాంపుల నిర్మాణం, అప్రోచ్ రహదారుల నిర్వహణ, స్టాక్ యార్డుల్లో వినియోగదారుల వాహనాలకు ఇసుక లోడింగ్ చేయడం వంటి ప్రక్రియలకు ఏజెన్సీలను గుర్తించేందుకు నిర్ణీత సమయంలోగా టెండర్ ప్రక్రియను చేపట్టి ఎంపిక చేయాలని అధికారులకు సూచించారు. ఏజెన్సీని ఖరారు చేసేందుకు జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన జిల్లా గనులు, భూగర్భవనరులు, రవాణా ఇరిగేషన్ శాఖ అధికారులతో కూడిన సబ్ కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. స్టాక్ యార్డుకు కనీసం ఇద్దరు చొప్పున షిఫ్ట పద్ధతిలో పోలీసు, రెవెన్యూ సిబ్బందిని నియమించడం సీసీ టీవీల ఏర్పాటు, మొబైల్ ఫోన్లు, పాయింట్ ఆఫ్ సేల్ మిషన్‌ల కొనుగోలుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇసుక రీచ్‌లకు సరిహద్దులను నిర్ణయించి సీసీ పిల్లర్లను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. తాడిగడప మున్సిపాలిటీకి మంజూరైన పనులను చేపట్టేందుకు ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం అవసరమైన ఇసుకను సరఫరా చేసేందుకు సంబందిత అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ గీతాంజలీ శర్మ, ఏఎస్పి ప్రసాద్, బందరు ఆర్డీఓ కె. స్వాతి, గనులు, భూగర్భ వనరుల శాఖ ఏడి శ్రీనివసరావు తదితరులు పాల్గొన్నారు.

గూడూరు పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర- గూడూరు: ఆకస్మిక తనిఖీ ల్లో భాగంగా సోమవారం జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు ఐపిఎస్ గూడూరు పోలీస్ స్టేషన్ ను సందర్శించారు.మొదటగా ఎస్పీ పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాలు, భౌగోళిక పరిస్థితులు పరిశీలించి పోలీస్ స్టేషన్ ఆవరణ గూర్చి సంత ృప్తి వ్యక్తపరిచారు. అలాగే పోలీస్ స్టేషన్లో ఉన్న అన్ని రూమ్ లను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ ఆవరణ ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండాలని ఎస్సై సత్యనారాయణ గారికి సూచించారు. పోలీస్ స్టేషన్ లో నిర్వహిస్తున్న అన్ని రికార్డులను గూర్చి ఎస్.ఐ. గారిని అడిగి తెలుసుకుని రికార్డ్ ల నిర్వహణలో ఏమాత్రం అలసత్వం ప్రదర్శించవద్దని ప్రత్యేక ఎప్పటికప్పుడు అప్డేట్ గా ఉంచాలని తెలిపారు. బాధితులకు సత్వర న్యాయం అందించగలమని అన్నారు.శాంతి భద్రతల పరిరక్షణలో గాని, నేరాల ఛేదన లో గాని, బందోబస్తు ఏర్పాట్లను అన్నింటిని సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. పోలీస్ స్టేషన్లో ఉన్న సిబ్బంది గూర్చి, వారు చేసే విధులు మరియు పోలీస్ స్టేషన్ పరిధిలో గ్రామాల వివరాలు గూర్చి అడిగి తెలుసుకున్నారు. పెండింగ్లో ఉన్న ప్రతి కేసులో పురోగతి సాధించాలని, సిబ్బంది విధుల్లో నైపుణ్యత పెంచుకోవాలని సూచించారు.తదుపరి కోనేరు సెంటర్ కి వచ్చి ట్రాఫిక్ పరిస్థితులు, విధులు నిర్వహిస్తున్న సిబ్బంది పనితీరు మరియు అధికారుల పర్యవేక్షణ మొదలైన అంశాలను పరిశీలించారు.

వరద బాధితులకు నిత్యావసరాలు పంపిణీ

విశాలాంధ్ర-విజయవాడ: బుడమేరు వరద ముంపు బాధితులకు దళిత స్త్రీశక్తి ఆధ్వర్యంలో పది సకురులతో కూడిన నిత్యావసరాల కిట్‌లు పంపిణీ చేశారు. స్థానిక ఐక్యతా భవన్‌లో సోమవారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా దళిత స్త్రీశక్తి జాతీయ కన్వీనర్ గడ్డం ఝాన్సీ మాట్లాడుతూ బలహీనవర్గాలుంటే ప్రాంతాలను మున్ముందు ముంపుకి గురికాకుండా దీర్ఘకాలిక ప్రణాళికలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జాతీయ కో.ఆర్డినేటర్ సత్య, రాష్ట్ర కోఆర్డినేటర్ రోజా, దివ్య, వివిధ ప్రాంతాల నుంచి మహిళా నాయకులు పాల్గొన్నారు. ఎస్సీ, ఎస్టీ సంఘాల అధినేతలు జల్లి విల్సన్, కొండలరావు, మాల్యాద్రి,చిరంజీవ చిట్‌ఫండ్ అధినేత టి.ఆదిరామ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో కాంట్రాక్టర్ నిలువు దోపిడి

ప్రభుత్వాసుపత్రిలో ఏఐటీయూసీ మచిలీపట్నం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ఓఎల్ రావు అధ్యక్షతన సోమవారం జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ తాతయ్య మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికుల నెలసరి వేతనం రూ.16 వేలు నాలుగు సంవత్సరాలుగా నెలకు 5 వేలు తగ్గించి ఇస్తున్నారన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులు ఆసుపత్రిలో 200 మంది ఉన్నారని, వారికి నెలకు రూ.11 వేల వేతనం మాత్రమే ఇస్తున్నారని, ప్రతి నెల 5వేలు తగ్గించి ఇస్తున్నారని అన్నారు. వేతన బకాయిలు ఇవ్వమని వర్కర్లు కాంట్రాక్టర్‌ను వత్తిడి చేసారు. కార్మికుల వేతనం నుంచి నెలకు వర్కర్ల మీద దోపిడీ లక్షరూపాయలని, ఈ విధంగా 50 నెలలనుండి తమకు వేతనం బకాయి మొత్తం రూ.50 లక్షలను నిలువు దోపిడీ చేశాడని తాతయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్‌ను నిలదీసిన వర్కర్లను ఉద్యోగం నుండి తీసేస్తానని బెదిరించారని, ఈ విషయంలో జిల్లా కలెక్టర్ డీకె.బాలాజీ, జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు కలుగజేసుకొని వర్కర్లకు రావాల్సిన బకాయిలను ఇప్పించాలని, అలాగే నెలసరి వేతనం సరిగా అందించే విదంగా కాంట్రాక్టర్‌పై తగిన చర్యలు తీసుకోవాలని టి. తాతయ్య విజ్ఞప్తి చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకొన్నారు.

నూతన కమిటీ :

ముఖ్య సలహాదారులుగా ఎల్. ఫిలిప్, బి. కోటేశ్వరరావులను ఎనుకున్నారు. అధ్యక్షులుగా జె. లక్ష్మి, డిఎల్.రావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జి.దుర్గా వరప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా ఎం. ఫణీంద్ర ఎన్నికయ్యారు. కోశాధికారిగా పి.సుధీర్ కుమార్, వైస్‌ప్రెసిడెంట్ డి.నాగలక్ష్మి, జి.బంజారమ్మ, ఉపాధ్యక్షులుగా వి. శివ లలిత, డి. కమల, ఉప కోశాధికారులుగా ఎం.అనిల్, పి.దుర్గ, ఉపకోశాధికారి పి. నాగ మల్లేశ్వరరావులను ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా ధనలక్ష్మి, కె. జోసఫ్, ఎస్ కె. జలీల్, ఎం.డి. అంబేద్కర్, పి. నాగశివ, మంగారావు, .పి. జ్యోతి, పి. వెంకట లక్ష్మి, వి. అంజలి, పి.వి. రమణ, ఎస్.దుర్గలను ఎన్నుకున్నారు.

'ముక్కా' కు విశిష్ట ఇష్ట పది చక్రవర్తి బిరుదు

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : పెనుగంచిప్రోలు కు చెందిన ఉపాధ్యాయ రచయిత ముక్కా సత్యనారాయణను మరో బిరుదు పురస్కారం వరించింది. మహతి సాహితీ కవిసంగమం, కరీంనగర్ వారు ఇష్టపది ప్రక్రియనందు సహస్ర అధిక రచనలు చేసినందుకు ఆయనకు విశిష్ట ఇష్టపది చక్రవర్తి బిరుదు ప్రధానం చేయడం జరిగింది. 1,116 నగదు బహుమతి కూడా పంపారు. ఇప్పటికే సత్యనారాయణకు ముప్పది వరకు బిరుదు పురస్కారాలు , 900 పైగా ప్రశంసా పత్రాలు రావడం జరిగింది. ఆయన మునేటి తీర రచయితల సంఘం అధ్యక్షుడిగా, మహతి సాహితీ కవిసంగమం ఉపాధ్యక్షుడిగా కూడా ఉన్నారు. ఈ సందరరేగా సత్యనారాయణను కవులు అడిగొప్పుల సదయ్య, పొర్ల వేణుగోపాలరావు, మోదేపల్లి శీనమ్మ, రాము కోటేశ్వరరావు తదితరులు అభినందించారు. ఇష్టపది ప్రక్రియలో ఇప్పటికే 1400 రచనలు చేసానని, రెండు తెలుగు రాష్ట్రాలలో అత్యధిక రచనలు చేయడం సంతోషంగా ఉందని ముక్కా.సత్యనారాయణ అన్నారు.

మండల పరిషత్ కార్యాలయము - చందర్లపాడు

ఆర్.సి.నెం.13/2024/ఏ తేది : 05-10-2024

వేలం నోటీసు

యన్.టి.ఆర్ జిల్లా చందర్లపాడు మండల పరిధిలోని **పొక్కునూరు ఫెర్రీ నుండి గుంటూరు జిల్లా అచ్చంపేట మండలము కోగంటివారి పాలెం వరకు 2024-2025 సం.లకు (డి.01-10-2024 నుండి డి.31-09-2025)**వరకు **(అనగా 12 నెలలకు)** కాలమునకు కృష్ణానదిపై పడవ/బల్లకట్టు త్రిప్పి సుంకం వసూలు చేయుటకు గాను **డి.16-10-2024వ, తేదీ బుధవారము బహిరంగ వేలం ఉదయం 11.00 గంటలకు** మండలపరిషత్ కార్యాలయము, చందర్లపాడు నందు నిర్వహించబడును ఈ క్రింది తెలిపిన షరతులకు లోబడి వేలం నిర్వహించుటకుగాను ముందుగా ధరావత్తు **రూ.92,500/-** డిమాండు డ్రాఫ్టును ముఖ్య కార్యనిర్వహణాధికారి, కృష్ణా, మచిలీపట్నం వారి పేరున చెల్లించి వేలంలో పాల్గొనవలెను, **అప్‌సెట్ విలువ రూ.9,25,000/లు** ఇతర వివరములు/షరతులకు చందర్లపాడు మండల ప్రజా పరిషత్, కార్యాలయపు పని వేళలయందు సంప్రదించి తెలుసుకోనగలరు.

మండల పరిషత్ అభివృద్ధి అధికారి,
మండల ప్రజా పరిషత్, చందర్లపాడు

జగనన్న లేఅవుట్లను పరిశీలించిన ఎమ్మెల్యే కాగిత

విశాలాంధ్ర-పెడన : పట్టణంలోని జగనన్న లేఔట్లను స్థానిక ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పరిశీలించారు. కాలనీ వాసులతో స్వయంగా వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి ఇల్లు కట్టుకొని అనేక సమస్యలతో సతమతమవుతున్నామని విద్యుత్‌లైట్లు, తాగునీరు లేకపోవడంతో చాలా ఇబ్బంది కరంగా ఉంటుందని కాలనీ వాసులు ఎమ్మెల్యేకు తమగోడును విన్నవించుకున్నారు. వర్షాకాల ప్రభావంతో బయట కూలి పనులకు వెళ్లి తిరిగి కాలనీలోకి వెళ్లాలంటే మోకాళ్ళ లోతు నీళ్లలో నడిచి వెళ్లాలంటే భయభ్రాంతులకు గురవుతున్నామని కాలనీవాసులు వాపోయారు. సమస్యలను త్వరితగతిన పూర్తి చేస్తానని కాలనీవాసులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, పెడన నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త పంచకర్ల సురేష్, పెడన పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు యక్కల.శ్యామలయ్య కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో 'ఆలపాటి'ను గెలిపించండి

విశాలాంధ్ర-పెనుగంచి ప్రోలు : తెలుగుదేశం, జనసేన, బిజెపి, పార్టీలు కూటమిగా ఏర్పడి మూడు నెలల క్రితం జరిగిన ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చారు. ఇపుడు పట్టభద్రుల ఎన్నికల్లో కూటమి బలపర్చిన కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ని అఖండ మెజార్టీతో గెలిపించాలని, పెనుగంచిప్రోలు మాజీ జెడ్పీటీసీ తిరుపతమ్మ అమ్మవారి ఆలయ మాజీ చైర్మన్ కాకాని శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆలపాటి. రాజేంద్ర ప్రసాద్. కాకాని గృహంలో ఆయనను కలువగా పై విదంగా ప్రకటన చేశారు.

ఉద్యోగి కుటుంబానికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : తమ సహా ఉద్యోగి అన్యారోగ్యంతో బాధపడుతుండటం చూసి తాము ఉన్నాము అంటూ తోటి ఉద్యోగులందరూ కలసి 1,43,000 నగదు వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్సు(ఆర్పీఎఫ్)లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న పి.సుధాకరరావుకు గత ఏడాది ఆగష్టు నుండి బ్రెయిన్ క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. ప్రస్తుతం రెండు సర్జరీలు చేయించుకుని లాలగూడ రైల్వే హాస్పటల్‌లో ఐపియులో ఉన్నారు.దాంతో అతని కుటుంబం అర్థిక ఇబ్బందులు పడుతున్నారని తోటి ఉద్యోగులు గుర్తించి తాము ఉన్నామంటూ ముందుకు వచ్చారు. డివిజనల్ సెక్యూరిటీ కమీషనర్ వల్లేశ్వర బి.తోకల సూచనలు మేరకు ఆర్పీఎఫ్ సిబ్బంది రూ.1,43,000 లక్షలను సోమవారం డివిజనల్ కార్యాయంలో ఉన్న ఎడిఎస్సీ అఫీసులో ఎడిఎస్సీ జి.మధుసూధనరావు చేతుల మీదుగా సుధాకర్ కుటుంబానికి నగదు అందజేశారు.ఒకరికి కష్టం కలిగినప్పుడు తాము ఉన్నామంటూ తోటి ఉద్యోగులు అండగా నిలవటం అభినందనీయమని సీనియర్ డిస్సీ ప్రశంసించారు.

ఆర్.డబ్ల్యూ.ఎస్. ఏ.ఈ గా సుగుణకుమారి



విశాలాంధ్ర-ఘంటశాల: ఘంటశాల ఆర్.డబ్ల్యూ.ఎస్.ఏఈ.గా సుగుణకుమారి బాధ్యతలు చేపట్టారు. సోమవారం మండల ప్రజాపరిషత్ అభివృద్ధి కార్యాలయంలో యం.పి.డి.ఓ. డి.సుబ్బారావు ఆధ్వర్యంలో అన్ని పంచాయితీల కార్యాదర్శులు ఆమెకు పుష్పగుచ్ఛం అందించి దుశ్శాలువాతో ఘనం సత్కారం చేశారు. ఆర్.డబ్ల్యూ.ఎస్. ఏఈ. సుగుణకుమారి మాట్లాడుతూ అందరితోనూ కలుపుగోలుతనంగా పోతూ స్వపక్షం, ప్రతిపక్షం అనే బేధం లేకుండా పనిచేసి మండల అభివృద్ధికి తన వంతు బాధ్యతగా ఉంటూ ప్రజలకు జవాబుదారీగా ఉంటానన్నారు.

పేకాటడిన ఖాకీ బాస్‌లు!

-దసరా ఉత్సవాలలో బందోబస్తు వచ్చిన అధికారులు

- నగరానికి చెందిన ఇద్దరు సీఐలు

విశాలాంధ్ర-విజయవాడ (క్రైమ్) : విజయవాడ ఇంద్రకీలాద్రిలో దసరా శరన్నవరాత్రులు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా శ్రీ కనకదుర్గ భవానీ అమ్మవారిని దర్శించుకొనేందుకు భక్తులు అధిక సంఖ్యలో ఇంద్రకీలాద్రికి తరలి వస్తున్నారు. అయితే భక్తుల రద్దీ నేపథ్యంలో ఏపీలోని పలు జిల్లాల పోలీస్ అధికారులు, సిబ్బందిని బందోబస్తు విధులకు కేటాయించారు. కాగా వీరికి ఇంద్రకీలాద్రి సమీపంలోని పలు హోటళ్లలో బస ఏర్పాటు చేశారు అధికారులు. కాగా విజయవాడ కొత్తపేటలో వీరు బసచేసిన హోటల్‌లో నలుగురు సీఐలు పేకాట ఆడినట్లుగా వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. విధులకు వచ్చిన పోలీస్ అధికారులు.. సరదాగా పేకాట ఆడారని భావించినా.. వీడియో వైరల్ కావడం పోలీస్ శాఖలోనే చర్చకు దారి తీసింది. ఈ వీడియోలో విజయవాడ టూ టౌన్ సిఐ కొండలరావు, పెనుకొండ సీఐ రాయుడులు, ఇబ్రహీంపట్నం సిఐ గా పని చేసి ప్రస్తుతం సైబర్ క్రైమ్ గా సిఐ గా శ్రీను, అతని స్నేహితుడు ఇబ్రహీం పట్నం కు చెందిన కాంట్రాక్టర్ దాడి హనుమంతరావు ఉన్నట్లు భావిస్తున్నారు. మరి కొంత మంది సిఐలు ఉన్నట్లు సమాచారం. అయితే పోలీస్ అధికారుల పేకాట వీడియో వైరల్ పై పోలీస్ శాఖ అంతర్గత విచారణ నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఈ వీడియో ఇప్పుడు తీశారా.. లేక ప్రస్తుతం జరుగుతున్న దసరా శరన్నవరాత్రుల బందోబస్తు కోసం వచ్చి, పేకాట ఆడారా. ఏదిఏమైనా పేకాట వీడియో మాత్రం వైరల్ కాగా.. కొందరు ఇదేమి పని సార్.. పేకాటరాయుళ్లను పట్టుకోవాల్సిన మీరే.. ఇలా పేకాట ఆడితే కరెక్ట్ కాదు అంటూ కామెంట్స్ చేస్తున్నారు. సరదాగా వారు ఆడిన పేకాట వీడియోను అసలు తీసింది ఎవరో కూడా తెలుసుకొనే పనిలో పోలీస్ శాఖ ఉన్నట్లు సమాచారం. ఇటువంటి ఘటనలు పోలీస్ శాఖ ప్రతిష్టను మసకబారేలా చేస్తాయని, భాద్యతాయుతమైన అధికారులుగా ఉన్న వీరు ఇలా పేకాట ఆడటం ఏమిటన్న చర్చలు కూడా సాగుతున్నాయి. ఇందులో వాస్తవం ఎంత ఉందో తెలియాలంటే పోలీస్ శాఖ నుండి ప్రకటన విడుదల కావాల్సి ఉంది.

అక్కినేని నట కీర్తి అజరామరం

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : అక్కినేని నాగేశ్వరావు నటనా కౌశలం అనన్య సామాన్యమని, తెలుగు సినీ రంగంలో ఆయన ఒక నట శిఖరమని, జీవితంలో విశిష్ట వ్యక్తిత్వం కలిగిన వ్యక్తిగా కొనియాడబడదగిన మహా మనీషి అని వేముల చారిటీస్ వ్యవస్థాపకుడు ఆధ్యాత్మిక, ధార్మికవేత్త డాక్టర్ వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. వారికి దాదాపు 35 సంవత్సరాల క్రితమే ఒక సభలో సన్మాన పత్రం రచించి, చదివి, సమర్పించిన భాగ్యం కలిగిందన్నారు. మహానటి సావిత్రి కళాపీఠం వారు అక్కినేని శతజయంతి ఉత్సవాలలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని పలువురు కళాకారులను సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అక్కినేనితో కొన్ని సభలలో పాల్గొనడం అదృష్టమని, తన తొలి సినిమా వారి స్టూడియోలో జరగడం, షూటింగ్ విరామ సమయంలో వచ్చి అభినందించి, ప్రోత్సహించడం జరిగిందన్నారు. వేదికపై కళాపీఠం వ్యవస్థాపకురాలు డాక్టర్ పరుచూరి విజయలక్ష్మి, డేవిడ్ రాజు, ప్రసూన రామన్, డాక్టర్ భాగ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

హమాలీలకు దసరా బోనస్ ఇవ్వాలి: ఏఐటీయూసీ

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్రంలో పౌరసరఫరాల శాఖకి చెందిన 253 మండల లెవెల్ స్టాక్ పాయింట్లు నందు లోడింగ్ అన్ లోడింగ్ పనులు నిర్వహించు హమాలీలకు దసరా బోనస్సు, స్వీట్ ప్యాకెట్లు, బట్టలు కుట్టుకూలీ ఇవ్వాలని కోరుతూ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, కార్పోరేషన్ ఎండీని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకట సుబ్బయ్య సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ అంశంపై ఎండీ స్పందిస్తూ ప్రస్తుతం పాత పద్ధతిలో బోనస్సు స్వీట్ ప్యాకెట్ కు అమౌంట్ ఇవ్వాలని అన్ని జిల్లాల డీఎం వరకు ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. ఈ సందర్భంగా కార్మికులు ఈ డబ్బులు తీసుకొని పండగ జరుపుకొలన్నారు. కార్మికులకు రావాల్సిన బకాయిల సాధనకు భవిష్యత్తు పోరాటాలకు సిద్ధంగా ఉండాలని వెంకటసుబ్బయ్య పిలుపునిచ్చారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక - ప్రజాదర్బార్ : ఎమ్మెల్యే కాగిత

విశాలాంధ్ర-పెడన : నిరంతరం ప్రజా సమస్యలు పరిష్కరించడానికి కూటమీ ప్రభుత్వం సిద్ధంగా ఉందని పెడన నియోజకవర్గ శాసనసభ్యులు కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. ఈ మేరకు సోమవారం పెడన తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మంగా ప్రవేశపెట్టిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గత ప్రభుత్వం ప్రజా సమస్యలను పట్టించుకోకుండా గాలికి వదిలేసిందని ఆయన అన్నారు. ప్రజల వద్ద నుండి పలు సమస్యలకు సంబంధించిన వినతులను స్వీకరించారు. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని ఎమ్మెల్యే అన్నారు. ప్రజా దర్బార్ కు అనూహ్యస్పందన లభించింది. ఈ కార్యక్రమంలో పెడన మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు శలపాటి వీరప్రసాద్, మండల కార్యదర్శి శిరం ప్రసాద్, పెడన మండల జడ్పిటిసి అర్జ వెంకట్ నగేష్ కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నాయకులు గౌరంగబాబు మృతి





విశాలాంధ్ర-విజయవాడ: తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ యలమంచిలి గౌరంగబాబు సోమవారం మృతి చెందారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. ప్రస్తుతం ఆయన టీడీపీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులుగా ఉన్నారు. తూర్పు నియోజకవర్గం లో తిరుగులేని నాయకుడుగా గుర్తింపు పొందారు. ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించిన నాటి నుంచి అదే పార్టీలో కొనసాగారు. గౌరంగబాబు మరణంపై టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు తీవ్ర సంతాపం తెలిపారు. దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్‌గా ఆయన అందించిన సేవలు చిరస్మరణీయం అన్నారు. విజయవాడలోని గౌరంగబాబు స్వగృహంలో ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

Document lost

సరిపల్లి ప్రసన్న జ్యోతి, తండ్రి మోసెస్, నివాసం సాయి భాస్కర అపార్టుమెంట్, ఫ్లాట్ నెం:104, మైయిల్ రాయి సెంటర్, పంట కాలువ రోడ్డు, గొల్లపూడి, ఎన్టీఆర్ జిల్లా వాస్తవ్యురాల నైన నేను ది.06-10-2024న పొలం అమ్మకము నిమిత్తం మాట్లడు కొనుటకు విజయవాడలోని గవర్నరుపేట నందు ఆటో లో ప్రయాణించు చుండగా నా హెండ్ బ్యాగ్, అందులోని ఒరిజనల్ దస్తావేజు పోయినవి, సదరు దస్తావేజు ఉయ్యూరు సబ్ రిజిష్టారు వారి ఆఫీసు నందు రిజిష్టరు కాబడిన డాక్యుమెంట్ నెం: 4407/2012 , తోట్ల వల్లూరు గ్రామం నందు గల యు.0.30 సెంట్లు లకు చెందిన ఒరిజనల్ దస్తావేజు పోయినది. ఎంత వెదికిన దొరకలేదు. కావున ఎవరికైన దొరికిన యడల పై అడ్రసుకు తెలుపగలరు.

మహారాజశ్రీ 12వ అదనపు జిల్లా జడ్జిగారి కోర్టు: విజయవాడ

ఐ.పి.నెం.3/2020

పెరుమాళ్ళ నవీన్ బాబు మరియు ఒకరు
- పిటీషనర్లు

మరియు

శ్రీరామ్ క్రియేషన్స్ మరియు 41మంది - రెస్పాండెంట్స్

పైన తెలిపిన పిటిషన్‌లో ఈ క్రింది తెలిపిన రెస్పాండ్స్‌కు ఎన్నిసార్లు బేటా కట్టినను వారు నోటీసులు తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున 1) 7వ ప్రతివాది అయిన ప్రొప్రయిటర్, కైలాష్ టెక్స్‌టైల్స్ షాప్ నెం.213, రెండవ ఫ్లోర్, లత భవన్ కాంప్లెక్స్, బి/హెచ్ పంచకువ, సింధీ మార్కెట్, కలుపూర్, అహమ్మదాబాద్, 2) 10వ రెస్పాండెంట్ అయిన ప్రొప్రెయిటర్, యష్ గార్మెంట్స్, జైన్ కాలనీ, లాస్ట్ గలీ నగర్‌షిప్, వెండ, ఘీకంట, అహమ్మదాబాద్, 3) 12వ రెస్పాండెంట్ అయిన ది. మేనేజరు, కె.పి. ఫ్యాబ్రిక్స్, జి/ఎ గ్రౌండ్‌ఫ్లోర్, ఎం.జి. మార్కెట్, నగర్‌సేట్స్, వాండీ, ఘీకంట, అహమ్మదాబాద్, 4) 30వ రెస్పాండెంట్ అయిన ఆర్. చిన్నారెడ్డి, డోర్ నెం. 41-24-42, గంగానమ్మ గుడి వీధి, డ్రైవర్‌పేట, కృష్ణలంక, విజయవాడ, 5) 36వ రెస్పాండెంట్ అయిన పి.పాండు, కొత్తపేట, విజయవాడ-1, 6) 37వ రెస్పాండెంట్ అయిన ఆర్ మధు, 4వ అంతస్తు, దత్తా కాంప్లెక్స్, రాజ్-యువరాజ్ థియేటర్ ఎదురుగా, గాంధీనగర్, విజయవాడ-3, 7) 39వ రెస్పాండెంట్ అయిన టి.అంజిరెడ్డి, తండ్రి అచ్చిరెడ్డి, కొత్తపేట, విజయవాడ-1, 8) 40వ రెస్పాండెంట్ అయిన వి. వెంకటరెడ్డి, తండ్రి సుబ్బారెడ్డి, స్వాతీ థియేటర్ దగ్గర, భవానీపురం, విజయవాడ-12, 9) 41వ రెస్పాండెంట్ అయిన పెరుమాళ్ళ బాలాజీ, తండ్రి మురళీకృష్ణ, స్వాతి థియేటర్ దగ్గర, భవానీపురం, విజయవాడ-12 గార్ల హాజరు నిమిత్తం కోర్టువారు పైన తెలిపిన కేసును 23-10-2024వ తేదీకి వాయిదా వేసియున్నారు. కావున పైన తెలిపిన మీ అందరికి తెలియజేయునది ఏమనగా మీరు స్వయంగాకాని, మీయొక్క న్యాయవాదుల ద్వారాకాని సదరు తేదీన సదరు కోర్టుకు ఉ.10.30గం॥లకు హాజరై సదరు కేసులో మీయొక్క వాదనలు వినిపించుకోగలరు. అలా మీరు హాజరు కానియెడల, సదరు కేసులో మీరు తెలుపుకోవలసినది ఏమియూ లేదని భావించి మీయొక్క పరోక్షంలో సదరు కేసును విచారించి కోర్టువారు తీర్మానించగలరు అని తెలియజేయున్నాము.

వాయిదా తేది : 23-10-2024

(కోర్టువారి ఆర్డరుపై ఇచ్చిన నోటీసు)

అలూరి సుధాకరరావు, దాసరి సుధాకర్,
న్యాయవాదులు, విజయవాడ.
సెల్ : 9392133535.

డాక్యుమెంట్ పోయినది

ఎన్టీఆర్ జిల్లా జి కొండూరు మండలం జి కొండూరు గ్రామ కాపురస్తులైన **వేముల మాధవరావు తండ్రి వెంకటరావు** అను నేను ఇబ్రహీంపట్నం మండలం మూలపాడు గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్ నందు సెక్రటరీగా పని చేయుచున్నాను. **2-9-2024**న వచ్చిన వరదలలో మూలపాడు గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్ ముఖ్య కార్యాలయం మొత్తం నీటిలో మునిగిపోయినది. ఆ సమయంలో వ్యవసాయ సహకార పరపతి సంఘంలో **గోగినేని శివరామకృష్ణయ్య గారి కుమారుడు గోగినేని రత్నకుమార్** లోను సమయంలో ఇచ్చిన ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్టర్ వారి కార్యాలయం నందు రిజిస్టర్ కాబడిన **డాక్యుమెంట్ నెంబర్లు 5652/2005,5653/2005,694/2017** మరియు విజయవాడ సబ్ రిజిస్టర్ వారి కార్యాలయంలో రిజిస్టర్ కాబడిన **డాక్యుమెంట్ నెంబర్ 544/1987 నంబర్లు** గల ఒరిజినల్ డాక్యుమెంట్లు పట్టాదారు పాసు పుస్తకములు వరదనీటిలో కొట్టుకుపోయినవి. కావున దొరికిన వారు కింది నెంబర్‌కు తెలియజేయగలరు. సెల్ : **9100266657.**

మహిళలు చట్టాలను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-కూచిపూడి : మహిళలు తమకు అందు బాటులో గల చట్టాలను సద్వినియోగ చేసుకుని సత్వర న్యాయం పొందాలని కృష్ణా జిల్లా న్యాయ సేవ సాధికారత సంస్థ కార్యదర్శి న్యాయమూర్తి, కె.వి రామకృష్ణయ్య పిలుపు నిచ్చారు. కృష్ణా జిల్లాలోని మొవ్వ ఐసిడిఎస్ ప్రాజెక్టులో విధాన్‌సేసమాధాన్‌లో భాగంగా జాతీయ మహిళా కమిషన్ మరియు జాతీయ న్యాయ సేవాధికారసంస్థల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన "మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు"లో ముఖ్యఅతిథిగా పాల్గొని మహిళలకు పలు సూచనలు ఇచ్చారు. సమాజంలో ప్రతి కుటుంబ వ్యవస్థలో నైతిక విలువలు ప్రతి ఒక్కరూ పాటిస్తూ వారి పిల్లలకు కూడా నైతిక విలువలపై అవగాహన కలిగించాల్సిన ఆవశ్య కత ఎంతైనా ఉందని పేర్కొన్నారు. దీనితో ప్రతి ఒక్కరిలో సోదరీసోదరభావం ఏర్పడి మెరుగైన సమాజం ఏర్పడు తుందని అభిప్రాయపడ్డారు. ఆ విధంగా వాతావరణం కొనసాగితే మహిళలపై దాడులు, వేధింపులు జరిగే అవకా శాలు ఉండవని స్పష్టం చేశారు. అలాగే మానవ అక్రమ రవాణా, గృహహింస జరిగే ఆస్కారాలు ఉండవన్నారు. మహిళలు తమకు ఉన్న చట్టాలపై అవగాహన పెంచుకోవా లని హితవు పలికారు. అదేవిధంగా వరకట్న నిషేధచట్టం, గృహహింస నిరోధక చట్టం, ఎన్నారై పెండ్లి సంబంధాల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై, పాఠశాల లోని పిల్లలపై ర్యాగింగ్ జరిగితే తీసుకోవాల్సిన పోలీస్ సహాయంపై అవగాహన కల్పించారు. మహిళలకు, పిల్లలకు, ఎస్సీ ఎస్టీలకు ప్రకృతి విపత్తులలోనష్టపోయిన వారికి, అన్యాయంగా జైల్లో ఉన్నవారికి న్యాయ సలహాలు సహాయాలుఉచితమేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మొవ్వ మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ గానున్న మొవ్వ కోర్టు న్యాయమూర్తి పి.రాజన్ ఉదయ్ ప్రకాష్, రిసోర్స్ మెంబర్స్ గొర్రిపర్తి శ్రీనివాసరావు, సరస్వతి లతో పాటు పలువురు న్యాయవాదులు, అంగన్వాడి సూపర్వైజర్స్ అంగన్వాడీ కార్యకర్తలు డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

నియంతృత్వ పోకడలను కట్టడి చేయాలి

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: గ్రామాల్లో కొనసాగుతున్న నియంతృత్వ, ఏకపక్ష ధోరణులను కట్టడి చేయాలని ఏఐటీయూసీ ఎన్టీఆర్, ఏలూరు జిల్లా నాయకులు మర్సకట్ల త్యాగరాజు, చాట్ల పుల్లా రావులు అధికారులకు వినతి చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఆయాలను ఎస్ఎంసీ కమిటీల పేరుతో నిర్లక్ష్యంగా తొలగించడాన్ని ఆపాలని వారు కోరారు. జిల్లాలోని విస్సన్నపేట, రెడ్డిగూడెం, గంపల గూడెం తదితర మండలాల్లో ఆయాల తొలగింపుపై ఎస్ఎంసీలకు విశేష అధికారాలిస్తూ ఎంఈఓలు వ్యవహరించటం దారుణమన్నారు. ఈ విధానాలకు స్వస్తి చెప్పకుంటే మహిళల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం చేస్తారని వారు పేర్కొన్నారు. ఈ మేరకు వినతిపత్రాన్ని ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖాధికారి యు.వి.సుబ్బారావుకు అందజేశారు.

ఎలుకల నివారణకు చర్యలు : కలెక్టర్ బాలాజీ

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : జిల్లాలోని రైతులందరూ సామూహిక ఎలుకల నివారణ చేపట్టి తమ పంటలను కాపాడుకోవాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సూచించారు. కలెక్టరేట్ ఛాంబర్‌లో సోమవారం మధ్యాహ్నం సామూహిక ఎలుకల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి గోడపత్రికను ఆవిష్కరించారు. విత్తనం వేసినది మొదలుకొని ధాన్యం అమ్మే వరకు ఎలుకలు వరిపైరుకు, ధాన్యానికి అపార నష్టం కలిగిస్తాయని, ఎలుకలను సమర్థవంతంగా నివారించుటకు వ్యవసాయ శాఖ వారు సూచించిన సమగ్ర సస్యరక్షణ పద్ధతులను పాటించాలని రైతులకు సూచించారు.

వరద బాధితులకు నిత్యావసరాలు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : ఇటీవలి వరదల్లో మురికి వాడల్లో అనేక కుటుం బాలు నీటిలో కూరుకుపోయి ఇంటి సామాన్లు కోల్పోయారని అటువంటి వారికి తమవంతు సాయంగా దళిత స్త్రీ కుటుంబాలకు నిత్యా వసరాలతో కూడిన కిట్‌ను అందజేశామని దళిత స్త్రీ శక్తి జాతీయ కన్వీనర్ ఝాన్సీ గెడ్డం తెలిపారు. 15 మురికివాడల్లో 5 గ్రామాల్లో వరద బాధితులకు చిరంజీవి చిట్‌ఫండ్స్ అధినేత టి.ఆదిరామ్ చేతుల మీదుగా సోమవారం అంబేద్కర్ జగ్జీవన్ ఐక్యతా భవన్‌లో అందజేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ కో-ఆర్డినేటర్ సత్యరాష్ట్ర కో-ఆర్డినేటర్లు రోజా, దివ్య, ఎస్సీ, ఎస్టీ నాయకులు కొండలరావు, మల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా సమస్యలు పరిష్కరించాలి : ఎమ్మెల్యే మండలి

విశాలాంధ్ర-అవనిగడ్డ : విద్యుత్ సరఫరాలో సమస్యలు ఏర్పడినప్పుడు సత్వరమే పరిష్కరించాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సూచించారు. మండలి తన కార్యా లయంలో విద్యుత్ శాఖ అధికారు లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలి మాట్లాడుతూ ఇటీవల కోడూరు నాయుడు పేటలో విద్యుత్ సమస్యపై ప్రజలు రోడ్డు ఎక్కే వరకు తీసుకురావడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఆందోళనకు అవకాశం ఇవ్వకుండా సత్వరమే స్పందన ఉండాలని మండలి సూచించారు. ఈ సందర్భంగా ఉయ్యూరు డిఈఈ డి కృష్ణ నాయక్ మాట్లాడుతూ వరద ముంపు గ్రామాల్లో విద్యుత్ సమస్యలు పరిష్కరించినట్లు చెప్పారు. ఈ సమీక్ష సమావేశంలో అవనిగడ్డ, చల్లపల్లి, ఎడిఈఈ లు నడకుదిటి సుబ్రహ్మణ్యేశ్వరరావు, పులి శివనాగేశ్వరరావు, సబ్ ఇంజనీర్లు టి ప్రసాద్‌లు, రాజు, గోపి లు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి ఆలపాటిని గెలిపించాలి

విశాలాంధ్ర-నందిగామ: రానున్న పట్ట భద్రుల ఎన్నికల్లో టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ని గెలిపించేందుకు నందిగామ నియోజ కవర్గంలో శ్రేణులు అందరూ కష్టపడి పనిచేయాలని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. స్థానిక కాకానినగర్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఉమ్మడి కృష్ణా-గుంటూరు గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటిరాజా, నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు నియోజకవర్గ ముఖ్య నేతలు పట్టణ పోలింగ్ బూత్ ఇన్చార్జిలతో కలిసి సమావేశం అయ్యారు. సౌమ్య మాట్లాడుతూ, ఆలపాటి రాజా మంత్రిగా,ఎమ్మెల్యేగా పార్టీకి ఎనలేని సేవలందించారని ఎంతో సౌమ్యమైన వ్యక్తి అని తెలిపారు. నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు క్లస్టర్ యూనిట్ ఇన్చార్జీలు, పట్టణ పోలింగ్ బూత్ ఇన్చార్జీలు కార్యకర్తలు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధి కోసం పనిచేయాలి : ఈవోపీఆర్డీ

విశాలాంధ్ర-పెదపారుపూడి : గ్రామ పంచాయతీల అభివృద్ధికి పనిచేయాలని ఈఓపీఆర్‌డీ వంగా శ్రీనివాస్ (వంశీ) సోమవారం అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పంచాయతీ కార్యదర్శులు పెదపారుపూడి గ్రామానికి ఎం సురేంద్ర చౌదరి, జమీదింటకుర్రు గ్రామానికి ఎన్ కృష్ణవేణి, పాములపాడు గ్రామానికి కే లావణ్య నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వ్యక్తులను ఈవోపీఆర్డి సభకులకు పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు నరేష్, శ్రీనివాస్, విజయ్, పరీష్, తదితరులు పాల్గొన్నారు.

విజయలక్ష్మిగా దర్శనమిచ్చిన రాజ్యలక్ష్మి దేవి

విశాలాంధ్ర-కూచిపూడి : మహాకవి క్షేత్రయ్య ఆరాధ్య దైవమైన రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయంలోఉపాలయంలోని రాజ్యలక్ష్మి అమ్మవారు దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సోమవారం భక్తులకు విజయలక్ష్మి దేవిగా దర్శనమిచ్చి ఆశీస్సులు అందించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఈవో ఎస్ వి సుబ్బారావు పర్యవేక్షణలో ఆలయ అర్చకులు దీవి వంశీ మోహన్, దీవి సీతారామ హనుమాన్‌ల ఆధ్వర్యంలో వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి.

యార్లగడ్డను కలిసిన రాజేంద్రప్రసాద్

విశాలాంధ్ర-గన్నవరం : గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పార్టీ కార్యా లయంలో మాజీ ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతర కృషి చేస్తున్నారని అన్నారు. అభివృద్ధి సంక్షేమ రాష్ట్ర ముఖ్యమంత్రి పనిచేస్తున్నారని చెప్పారు. అనంతరం సీఎం చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి పథంలో నడుస్తుందని రాష్ట్ర ప్రజలు విశ్వసిస్తున్నారు.

తిరుపతమ్మకు 6 గ్రాముల బంగారు ముక్కు పుడక

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : శ్రీ తిరుపతమ్మ అమ్మవారికి విజయ వాడ పడమటకు చెందిన నంద మూరి కళ్యాణ చక్రవర్తి, మాధవి దంపతులు తిరుపతమ్మ అమ్మవారికి 6 గ్రాముల బంగారు ముక్కుపుడకను సోమవారం బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు బెజవాడ శ్రీనివాసరావు పాలాది వెంకటరమణ. ఆలయ ఏ ఈ ఓ తిరుమలేశ్వర్ రావ్ పాల్గొన్నారు. వారికి ఆలయ అర్చకులు వేద పండితులచే వేద ఆశీర్వచనం శేష వస్త్రాలు తీర్థ ప్రసాదాలు అందజేసినారు.

మహాచండీ దేవిగా అమ్మవారు

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : స్థానిక తూర్పు బజార్‌లో దుర్గామల్లేశ్వర ఉత్సవ కమిటీ ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన శ్రీ దేవి శరన్నవరాత్రులలో భాగంగా 5వ రోజు అమ్మవారు శ్రీ మహా చండీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

విద్యార్థులకు ఉపకార వేతనాలు

విశాలాంధ్ర-చల్లపల్లి : దాతల సహకారాన్ని సద్విని యోగం చేసుకొని విద్యా ర్థులు ఉన్నత శిఖరాలను అధి రోహించాలని కాకినాడలోని బిఆర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ భారత లక్ష్మి సూచించారు. ఎంఏ ఖాదర్ ఖాన్ ట్రస్ట్ (విజయవాడ) ఆధ్వర్యంలో ముస్లిం షాదీఖానాలో ప్రతిభావంతు లైన 15 మంది విద్యార్థులకు రూ.లక్ష ఉపకారవేతనాలు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన భారత లక్ష్మి మాట్లాడుతూ చల్లపల్లి కి చెందిన ముజీనా బాను తన తండ్రి పేరుమీద ట్రస్ట్ ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు సహకారం అందించడం సూర్తి దాయకమ న్నారు. ఈ కార్యక్రమం లో ట్రస్ట్ సభ్యులు ముజీనా బాను, నసీరుద్దీన్, మునీర్ ఖాన్, జహీరుద్దీన్, మసీద్ కమిటీ అధ్యక్షులు నసీమ్ ఘోరీ, ఉపాధ్యా యులు కస్తూరి సుభాషిణి, ఎం. డి. అస్లాం బాషా పాల్గొన్నారు.

మైత్రీ ఫౌండేషన్ సభ్యులు ఫణికు అరుదైన గౌరవం



విశాలాంధ్ర-మచిలీపట్నం : మచిలీపట్నం మైత్రీ ఫౌండేషన్ గౌరవ సభ్యులు నీలపాల ఫణి కుమార్‌కి అరుదైన గౌరవం లభించింది. ప్రఖ్యాత సేవ సంస్థ బహుజన సాహిత్య అకాడెమీ బి ఎస్ ఏ ఆధ్వర్యంలో తిరుపతి కేంద్రంగా జరిగిన 8 వ సౌత్ ఇండియా కార్యక్రమంలో భాగంగా వివిధ రాష్ట్రాల నుంచి సేకరించిన సమాచారం మేరకు ఆంధ్రప్రదేశ్ నుండి ఉత్తమ సేవలకు గుర్తింపుగా కృష్ణా జిల్లా మైత్రీ ఫౌండేషన్ గౌరవ సభ్యులు ఫణికుమార్ కి సేవారత్న అవార్డు లభించింది. ఈ కార్యక్రమంలో భాగంగా బి ఎస్ ఏ తరుపున సర్టిఫికేట్ మెమెంటో శాలువా తో సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఫణి చేస్తున్న సేవలను సంస్థ జాతీయ అధ్యక్షులు నల్లా రాధా కృష్ణ కొనియాడారు. ఫణి కుమార్ భవిష్యత్తు లో మరెన్నో ప్రతిష్ఠాత్మకమైన గౌరవాలు పొందాలని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఫణి కి మైత్రీ ఫౌండేషన్ కుటుంబం తరుపు నుండి అభినందనలు తెలియపరుస్తూ ఇది మైత్రీ ఫౌండేషన్ కు గర్వకారణం అని అధ్యక్షులు కేసాని వేణుకుమార్ అన్నారు.

సమస్యలను సమష్టిగా పరిష్కరిద్దాం : ఎమ్మెల్యే వర్ల

విశాలాంధ్ర-పమిడిముక్కల: ప్రజలతో ప్రజా సమస్య లను తెలుసుకుని అధికారులతోపాటు సమిష్టిగా పరిష్కారా నికే ప్రజా వేదిక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా అన్నారు. సోమవారం పమిడిముక్కల పంచాయతీ ఆవరణలో ప్రజా వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ సీఎం చంద్రబాబునాయుడు సంక్షేమ పాలనకు శ్రీకారం చుట్టారు. గత పాలకులు జవాబుదారీతనం లేక ప్రజలు అవస్థలు పడ్డారని అన్నారు. పామర్రు నియోజకవర్గ పరిధిలో 2300 మందికి పంట నష్టపరిహారంగా రూ.2.23 కోట్లు రైతులు ఖాతాల్లో జమ అయ్యాయిని ఇంకా కొంతమంది కి ఈ రోజు కూడ జమ అవుతాయని తెలిపారు. పలు సమస్యలపై 225 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ విరల్‌పాల్ తహశీల్దార్ నవీన్‌కుమార్ సూపరిం టెండెంట్ గోలి భూపతి రామకృష్ణ పలువురు అధికారులు సర్పంచ్ యం.సునీత తెదేపా మండల అధ్యక్షుడు రాజుల పాటి శ్రీనివాసరావు రైతులు తెదేపా నాయకులు జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జాస్తి మాధవరావుకు నివాళి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : తుళ్లూరు మండలం వడ్డమాను గ్రామంలో టీడీపీ సీనియర్ నేత జాస్తి మాధవరావు ఇటీవలే అనారోగ్యంతో కన్నుమూశారు. ఈ సందర్భంగా అఖిల భారత పంచాయతీ పరిషత్ (న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ పంచాయతీ పరిషత్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు జాస్తి మాధవరావు చిత్రపటానికి పూలు వేసి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం డాక్టర్ జాస్తి వీరాంజనేయులు మాట్లాడుతూ మాధవరావు గతంలో తుళ్లూరు మండలంలో టీడీపీ సీనియర్ నేతగా ఎదిగి పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేశారన్నారు. నివాళులర్పించిన వారిలో తాడికొండ మాజీ ఎంపీడీఓ మేకా సుబ్బారావు, గుంటూరు గురవయ్య కాలేజీ మాజీ ప్రిన్సిపాల్ జేవీ కృపారావు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మాజీ మేనేజర్ జిజిహెచ్ జాస్తి సుబ్బయ్య, భీమన రామోహనరావు, రాజా రామోహనరావు, సూర్యం, సాయిబాబా, లక్ష్మయ్య, జాస్తి రామారావు, భీమన రాజ్యలక్ష్మి, లక్ష్మి, అమర్ శేషేంద్ర, సురేంద్ర తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థిగా లగడపాటి వేణుగోపాల్

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: గుంటూరు-కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్టు అధ్యాపకులు లగడపాటి వేణు గోపాల్ తెలిపారు. సోమవారం స్థానిక బ్రాడీపేట ఎస్‌హెచ్‌ఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వేణుగోపాల్ మాట్లాడుతూ తాను మధ్య తరగతి వర్గ రైతాంగం నుంచి వచ్చానని దాదాపుగా 36 సంవత్సరాల పాటు అధ్యాపకులుగా సేవలందించానని తెలిపారు. శాసన మండలి ఏర్పడినప్పటి నుంచి పట్టభద్రుల సమస్యలను గత పాలక ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం బాధాకరమైన విషయమని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టభద్రుల ఉద్యోగ అవకాశాల విషయంలో నిరుద్యోగ భృతి విషయంలో ఆచరణలో అమలు లేదని ఆయన దుయ్యబట్టారు. అంతేకాకుండా ప్రధాన రంగాలైన వ్యవసాయ రంగంలో కూడా రైతులు, కౌలు రైతులను, కార్మిక వర్గాన్ని పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. అనంతరం దశ దిశ లక్ష్యాలతో మేనిఫెస్టోని ఆవిష్కరించి అంశాలను వివరించారు. గుంటూరు-కృష్ణా జిల్లాల పట్టభద్రులు అందరూ కూడా నాకు మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు అంజయ్య, బీసీ సంఘ నాయకులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

శివాలయంలో అన్నదానం

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరి శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో శ్రీ కాశి అన్నపూర్ణేశ్వరి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతినెల అమావాస్య తర్వాత జరిగే అన్నదాన కార్యక్రమం సోమవారం జరిగింది. ట్రస్ట్ చైర్మన్ పందేటి సాంబశివరావు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ పందేటి మాట్లాడుతూ భక్తుల సహకారంతో ప్రతి నెలలో అమావాస్య తర్వాత వచ్చే సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో జేవీ నారాయణ, ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ బోగి కోటేశ్వరరావు, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పుప్పాల కోటేశ్వరరావు, ట్రస్ట్ ప్రతినిధులు కర్నాటి శివ సత్యనారాయణ, కొగ్గా శ్రీనివాసరావు, జూటు ఏడుకొండలు, కల్వకొల్లు గోపి బాబు, కోటేశ్వరరావు, అన్నపురెడ్డి రామకృష్ణారెడ్డి, గండికోట అచ్చయ్య, పెరుమాళ్ళ సుబ్రహ్మణ్యం, రెడ్డి వీరరాఘవులు, పంచల శివన్నారాయణ, బాలమోహన్, బత్తుల శంకర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్స్ వర్సిటీ అధ్యాపకుడికి పీహెచ్‌డీ

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ కంప్యూటర్ అప్లికేషన్ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ వేల్పుల నాగిరెడ్డికి తమ యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో పీహెచ్‌డీ పట్టా అందజేసిందని వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్ సోమవారం తెలియజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫ్ నోవెల్ ఫ్రేమ్‌వర్క్ ఫర్ క్లాసిఫికేషన్ అండ్ సెగ్మెంటేషన్ ఆఫ్ బ్రెస్ట్ ట్యూమర్స్ బై యూజింగ్ డీప్ లెర్నింగ్ టెక్నిక్స్' అనే అంశంపై పరిశోధన చేశారని తెలియజేసారు. ఈయనకు విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ కంప్యూటర్ అప్లికేషన్స్ విభాగంలోని అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.సుబ్బారావు గైడ్‌గా వ్యవహరించారు. పీహెచ్‌డీ పట్టా పొందిన వేల్పుల నాగిరెడ్డిను పి.నాగభూషణ్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, సిబ్బంది అభినందించారు.

అభివృద్ధిలో వార్డు సభ్యులే కీలకం

విశాలాంధ్ర-శావల్యాపురం: పంచాయతీల అభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర కీలకమని ఎంపిడిఓ పేరుమీన శీతారామయ్య అన్నారు. మండలంలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ ఉపసర్పంచ్లు, వార్డు సభ్యులకు రెండు రోజులపాటు జరిగే శిక్షణా తరగతులు సోమవారం పారంభమైనాయి. ఈసందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ ఉపసర్పంచ్లు, వార్డుమెంబర్లు శిక్షణ తరగతులను సద్వినియోగపర్చుకొని వార్డుల్లో సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఎపిఓ కటారపు రామారావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కళలకాణాచి నాటక పోటీలు ప్రారంభం

విశాలాంధ్ర-తెనాలి : తెనాలిలో సోమవారం కళలకాణాచి- తెనాలి, వేదగంగోత్రి ఫౌండేషన్ -విజయవాడ వారి సంయుక్త ఆధ్వర్యంలో జాతీయస్థాయి చతుర్ధ పద్యనాటక సాంఘిక నాటిక పోటీలు ప్రారంభమయ్యాయి. తెనాలి కొత్తపేట రామకృష్ణ కవి కళాక్షేత్రంలో మధ్యాహ్నం కవితా గోష్ఠి నిర్వహించారు. కీ.శే. వల్లూరి వెంకట్రామయ్య చౌదరి, కన్నెగంటి నాసరయ్య, కొడాలి గోపాలరావు, బెల్లంకొండ రామరాజు గార్ల శతజయంతిని పురస్కరించుకొని సదస్సు జరిగింది. సదస్సులో ప్రముఖ రంగస్థల నటులు, దర్శకులు, ప్రయోక్త డా. డి.యస్.ఎన్.మూర్తి అధ్యక్షత వహించారు. ఆత్మీయ అతిధిగా కారుమూరి సీతారామయ్య పాల్గొన్నారు. వల్లూరి వెంకట్రామయ్య చౌదరి గురించి రచయిత, నాటకరంగ విశ్లేషకులు డా.కందిమళ్ళ సాంబశివరావు వివరించారు. కొడాలి గోపాలరావు గురించి రంగస్థల విశ్లేషకులు హైదరాబాద్ వేల్పుల బుజ్జిబాబు ఆయన జీవిత విశేషాలను, ఆయన రచనల గొప్పతనాన్ని తెలియజేశారు. కీ.శే. కన్నెగంటి నాసరయ్యను గురించి నాటకరంగ విశ్లేషకులు అంబటి మురళీకృష్ణ విస్తృతంగా తెలియజేశారు. వరిష్ట పాత్రికేయులు, రచయిత డా.రెంటాల జయదేవ్ బెల్లంకొండ రామరాజును గురించి వివరించారు. సాయంత్రం 5 గంటలకు శ్రీ దుర్గాభవాని నాట్యమండలి తెనాలి వారు శ్రీకృష్ణ రాయభారం ప్రదర్శించారు. నిర్వాహణ ఆదినారాయణ వహించారు. వల్లూరి వెంకట్రామయ్య చౌదరి శతజయంతి స్మారక పురస్కారాన్ని ప్రముఖ రంగస్థల పౌరాణిక నటులు ఆచంట బాలాజి నాయుడుకు, కన్నెగంటి నాసరయ్య శతజయంతి స్మారక పురస్కారాన్ని ప్రముఖ రంగస్థల రచయిత, నటుడు, దర్శకుడు జరుగుల రామారావుకు అందజేశారు. కొడాలి గోపాలరావు శతజయంతి స్మారక పురస్కారాన్ని ప్రముఖ రంగస్థల రచయిత గుంటూరు వారి వల్లూరు శివప్రసాద్‌కు, అమరకవి బెల్లంకొండ రామరాజు స్మారక పురస్కారాన్ని ప్రముఖ రంగస్థల రచయిత జమ్మలమడుగు కృష్ణమోహన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారిని కమిటి సభ్యులు కళలకాణాచి-తెనాలి వ్యవస్థాపక అధ్యక్షులు సాయిమాధవ్ బుఱ్ఱా, అధ్యక్షులు చెరుకుమల్లి సింగారావు, ప్రధాన కార్యదర్శి గోపరాజు విజయ్ సన్మానించి వారిని గురించి వివరించారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ తీర్పు వ్యతిరేకిస్తూ రౌండ్ టేబుల్ సమావేశం

విశాలాంధ్ర-పొన్నూరు : ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ పొన్నూరులో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక జేఏసీ నాయకుడు, న్యాయవాది పొందుగల చైతన్య ఆధ్వర్యంలో జరిగిన ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో సుప్రీంకోర్టు వర్గీకరణకు వ్యతిరేకంగా ఇచ్చిన తీర్పును మాల న్యాయవాదులు, దళిత సంఘాలు, జేఏసీ నాయకులు ఖండించారు.

ఆసుపత్రిని ఆరోగ్య వాతావరణంలోకి తెచ్చేందుకు కృషి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిని రోగులు, వారి సహాయకులు వస్తున్న నేపధ్యంలో ఆరోగ్యకరమైన వాతావరణాన్ని తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని, అందుకు ప్రజలు కూడా సహకరించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్, ఆసుపత్రి కమిటీ సభ్యులు డాక్టర్ శన క్కాయల ఉమా శంకర్ పిలుపు నిచ్చారు. ఆసుపత్రి ప్రధాన గేటు వద్ద సుందరీకరణ కోసం ప్రత్యేక పూజలతో శంకుస్థాపన కూడా చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్, డాక్టర్ ఉమా శంకర్ మాట్లాడుతూ ఆసుపత్రి లోపల గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తుండటం వలన వైద్యులు, సిబ్బంది ఆందోళనకు గురవుతున్నారని, ఇటీవల వైద్యులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ సమ్మెలో పాల్గొన్న సంగతిని వారు గుర్తు చేశారు. ఈ పరిస్థితుల్లో ఆసుపత్రికి కేవలం రోగులు, వారి సహాయకులు మాత్రమే లోపలికి ప్రవేశించాలని, ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రం చేసేందుకు, పారిశుద్ధ్యాన్ని మెరుగ్గా ఉండేవిధంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆస్పత్రి గోడలను నీళ్లతో కడిగి పరిశుభ్రం చేసినట్లు తెలిపారు. ఆసుపత్రి అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, సత్య కుమార్ ప్రత్యేక దృష్టి సారించారన్నారు.

హోప్‌విన్ హాస్పిటల్స్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

'ఉచిత శిబిరం'లో డాక్టర్ షమ సుల్తానా

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : పశ్చిమ నియోజకవర్గంలోని శ్రీనివాసరావుపేటలో ఉన్న పెనియల్ ప్రేయర్ మినిస్ట్రీస్ నందు హోప్‌విన్ హాస్పిటల్స్, మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి (ఎంహెచ్‌పీఎస్)ల సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హోప్‌విన్ హాస్పిటల్స్ చైర్మన్, మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి ఉమెన్స్ వింగ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ షమ సుల్తాన వైద్య శిబిరానికి వచ్చిన పేషెంట్లకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సుమారు 170 మంది పేషెంట్లకు అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలను అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు తప్పకుండా సద్వినియోగం చేసుకుని తమ జీవన ప్రమాణాలను పెంచుకోవాలని కోరారు. పేద ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించాలన్న లక్ష్యంతో హోప్‌విన్ హాస్పిటల్స్ 10 రూపాయలకే ఓపిని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి పేషెంట్ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదేవిధంగా హోప్‌విన్ హాస్పిటల్స్‌లో ఉన్న అన్ని రకాల వైద్య సేవలను అతి తక్కువ ఖర్చుతో పొందాలని ఆమె సూచించారు. ఆరోగ్యశ్రీ, ఈహెచ్‌ఎస్, అన్ని రకాల హెల్త్ ఇన్సూరెన్స్ లు తమ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. పెనియల్ ప్రేయర్ మినిస్ట్రీస్ పాస్టర్ రత్నకుమారి మాట్లాడుతూ హోప్‌విన్ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ షమ సుల్తానా మా చర్చి నందు ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హోప్‌విన్ హాస్పిటల్స్ మేనేజర్ పి.నాగేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దస్తావేజులు పోయినవి

నేను అనగా గుంటూరుజిల్లా, పెదకాకాని(మం), అగతవరప్పాడు గ్రామం, డోర్.నెం. 1-117/1వ కాపురస్తులు కొప్పుల యాకోబు గారి కుమారుడు కొప్పుల నవీన్ కుమార్ ఇచ్చు బహిరంగ ప్రకటన, నాకు సంబంధించిన ఆస్తియొక్క ఒరిజినల్ దస్తావేజులు మరియు వాటి లింకు డాక్యుమెంట్లు అయిన పెదకాకాని సబ్.రిజిష్ట్రరు వారి ఆఫీసులో 1వ పుస్తకంలో రిజిష్టరు కాబడిన విక్రయ దస్తావేజు నెం.1261/2020రు మరియు విక్రయ దస్తావేజు నెం.1262/2020రు, గుంటూరు జిల్లా రిజిష్టరు వారి ఆఫీసులో 1వ పుస్తకంలో రిజిష్టరు కాబడిన విక్రయ దస్తావేజు నెం.3504/2021రు, విక్రయ దస్తావేజు నెం.1286/ 2007రు మరియు విక్రయ దస్తావేజు నెం.662/1997రు తీసుకొని పెదకాకాని(మం), నంబూరు గ్రామంలోని రియల్ ఎస్టేట్ వ్యాపారిని కలిసి అతనికి డాక్యుమెంట్లు జిరాక్స్ కాపీలను ఇచ్చి నాతోపాటు తీసుకెళ్ళిన ఒరిజినల్ కాపీలతో తిరిగి నేను అగతవరప్పాడు గ్రామంలోని నా ఇంటికి బయలుదేరుటకు నంబూరు శివాలయం సెంటర్‌లో ఆటో ఎక్కినాను. గడ్డిపాడు వద్ద ఇన్నర్ రింగురోడ్డులో దిగిన నేను ఆటోలో నా ప్రక్కనే పెట్టుకొని వున్న ఒరిజినల్ కాపీలను తీసుకొనేందుకు చూడగా అవి కనిపించలేదు. అప్పటికే నాతోపాటు ఉన్న ప్రయాణికులను విచారించగా, ఆటోను గాలించినా ఎలాంటి సమాచారము గాని, ఆచూకి గాని లభించలేదు. కావున సదరు దస్తావేజులు ఎవరికైనను దొరికినయెడల పైన తెలిపిన అడ్రస్ నందుగాని, క్రింద తెలిపిన ఫోన్ నెంబరుకు ఫోన్‌చేసి గాని అందజేసిన వారికి తగిన బహుమతి ఇవ్వబడును. అట్లుగాక సదరు దస్తావేజులను ఉపయోగించి ఏవిధమైన లావాదేవీలు గాని, అన్యాక్రాంతములు గాని జరిపినయెడల నేను తీసుకొను చట్టపరమైన సివిల్ & క్రిమినల్ చర్యలకు బాధ్యులుగుదురని తెలియజేయుచున్నాను.

కొప్పుల నవీన్ కుమార్, తండ్రి. యాకోబు
అగతవరప్పాడు, గుంటూరు జిల్లా. సెల్: 9177693601

బేకరీలో గడువు తీరిన తిను బండారాలు

విశాలాంధ్ర-దాచేపల్లి: కేసానపల్లి రోడ్డుకు ఎదురుగా ఉన్న సర్వీసు రోడ్డులోని ఓ బేకరీలో గడువు తీరిన తిను బండారాలను సోమవారం అధికారులు గుర్తించారు. నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ జిల్లా చైర్మన్ తాళ్ళూరి శౌరి బాబు ఇటీవల ఫిర్యాదు చేశారు. దాంతో ఫుడ్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఆకస్మిక తనిఖీ చేశారు. అందులో ఉన్న తిను బండారాలకు గడువు తీరినట్లు చెప్పారు. వాటి తయారీ కూడా వ్యక్తిగత మరుగుదొడ్డిలో చేస్తున్నట్లు గుర్తించారు. ఇవన్నీ కూడా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సంబంధిత వ్యాపారిపై కేసు నమోదు చేస్తామని, తగిన చర్యలు కూడా తీసుకుంటామని చెప్పారు. జిల్లా గౌరవాధ్యక్షులు నసీమ్ బాషా తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర-దాచేపల్లి: నగర పంచాయతీ పరిధిలోని ఏలియంపేట కాలనీలో ఉన్న ఓ నిరుపేద కుటుంబానికి ఓ దాత సోమవారం ఆర్థిక సాయం చేశారు. వారధి ఫౌండేషన్ అధ్యక్షుడు, స్థానిక ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు తగరం ఆనంద్ కుమార్ ఆ బాధిత కుటుంబానికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.7 వేల ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వట్టెపు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో డాక్టర్లను నియమించాలి

విశాలాంధ్ర-పెదకూరపాడు : పెదకూరపాడులోని కమ్యూనిటీ ఆసుపత్రిలో ఎనస్తీషియా, గైనకాలజిస్ట్, జనరల్ సర్జన్ డాక్టర్లను వెంటనే నియమించాలని రైతు సంఘం కార్యదర్శి దర్శి శేషారావు, గ్రామస్తులు, రైతులతో కలిసి తహసిల్దార్ దానియేలుకు వినతిపత్రం సోమవారం ఇచ్చారు. దర్శి శేషారావు మాట్లాడుతూ పెదకూరపాడులో కమ్యూనిటీ ప్రభుత్వ ఆసుపత్రిలో గైనకాలజిస్ట్ 11 నెలల 20 రోజుల నుంచి డాక్టరు అందుబాటులో లేని పరిస్థితి ఉందని, 7 నెలల నుంచి జనరల్ సర్జన్ డాక్టర్ లేరన్నారు. నాలుగు నెలల నుంచి ఎనస్తీషియా డాక్టర్ పోస్ట్ ఖాళీగా ఉందని, దీంతో పెదకూరపాడు పరిసర గ్రామ ప్రజలు, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. తాళ్లూరు, అత్తలూరు, మందపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి రోగులను సర్జరీ కోసం సిఫార్సు చేసేవారని, సర్జన్ డాక్టర్ లేకపోవడంతో రోగులు దూర ప్రాంతాలకు వెళ్ళవలసి వస్తుందన్నారు. ఈ నేపథ్యంలో డాక్టర్లను వెంటనే నియమించాలని, కొత్త ఆసుపత్రి బిల్డింగులో వసతులు ఏర్పాటు చేసి వినియోగములోనికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం.మస్తాన్‌రావు, పి.ఖాసింఖాన్, ఎం.నాగేశ్వరరావు, వి.నరేంద్ర, బి.శివ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నందంను అభినందించిన కన్నా

విశాలాంధ్ర-సత్తెనపల్లి : పద్మశాలి వెల్ఫేర్ చైర్మన్ నందం అబద్దయ్య ను సత్తెనపల్లి శాసన సభ్యులు కన్నా లక్ష్మి నారాయణ సోమవారం అభినందించారు. ఆంధ్రప్రదేశ్ పద్మశాలి వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన నందం అబద్దయ్య కి పూల మాల సాలువాతో నియోజకవర్గ శాసన సభ్యులు కన్నా లక్ష్మి నారాయణ శుభాకాంక్షలు తెలియచేశారు. కార్పొరేషన్ ద్వారా సత్తెనపల్లి ప్రాంత పద్మశాలీలకు తగిన సహకారం అందించాలన్నారు

దోమల నివారణకు కఠిన చర్యలు: కమిషనర్

విశాలాంధ్ర-వినుకొండ: పట్టణంలో దోమల వల్ల సంక్రమించే వ్యాధులను అరికట్టేందుకు ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆదేశం మేరకు వర్షాకాలం నీటిలో వృద్ధి చెందే దోమల వల్ల కలిగే వ్యాధులను ఎదుర్కోవడానికి మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ పట్టణం అంతటా నిలిచిపోయిన నీటి ప్రాంతాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. దోమల పెంపకం ప్రమాదకర స్థాయిలో ఉన్నట్లు గుర్తించారు. దీనితో కమిషనర్ యాంటీ లార్వా ఆపరేషన్స్‌కు ఉపక్రమించాలని కఠినమైన ఆదేశాలు జారీ చేశారు. మీ ఇళ్లు, బహిరంగ ప్రదేశాల చుట్టూ నిలిచిపోయిన నీటిని తొలగించాలని, దోమల వికర్షకాలను ఉపయోగించి కార్యకలాపాలకు మద్దతు ఇవ్వాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కొబ్బరి బోండాలు, పాత టైర్లు, మూసుకు పోయిన కాలువలు, సింక్‌లు, ఫ్లవర్ వాజ్‌లు, మొక్కల కుండీలు, బాత్రూమ్ సింక్‌లు, టాయిలెట్లు, కిచెన్ సింక్‌లు, డిష్రాక్‌లు, ఎయిర్ కూలర్‌లు, కాంక్రీట్ పైపులు, నీటి కుంటలు, మూసుకుపోయిన గట్టర్‌లు, జంతువులు ఉండే ప్రదేశాలు, తోటలు, చెత్త డబ్బాలు ఎప్పటికప్పుడు పరిశీలించి శుభ్రపరుచుకోవాలని, దోమల ద్వారా వ్యాపించే మలేరియా, డెంగ్యు, జికా వంటి వ్యాధులపై పోరాటంలో భాగస్వాములు కావాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

జగన్మాత అలంకార వైభవం

విశాలాంధ్ర-రెంటచింతల : మహా బలవంతులైన అసురులను సంహరించి, సర్వలోకాలకు మహోపకారం చేయాలనే ప్రధాన సంకల్పంతో అవతరించిన జగధాత్రిని స్మరించుకుంటూ, ఆమె వైభవాన్ని కీర్తిస్తూ జరుగుతున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు అఖిలాండేశ్వరి అలంకార వైభవంతో అలరారుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం దుర్గా మాత మండపాల్లో అమ్మవారు సంతాన లక్ష్మి, శ్రీ మహా చండి అలంకారంలో దర్శనమిచ్చారు. కన్యకాపరమేశ్వరి ఆలయం, చౌడేశ్వరి ఆలయం, జంక్షన్‌లోని కనక దుర్గ ఆలయాల్లో మంగళ వాయిద్యాల నడుమ అర్చకుల వేద మంత్రాలు పఠనం చేస్తుండగా దేవి శక్తి ఉద్దీపన అయ్యే లా ప్రత్యేక పూజలు, హోమాలు జరిగాయి. మహిళలు లలితా సహస్ర నామ పారాయణం పఠించగా, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఆలయాల్లో ఆగమ సంప్రదాయానికి అనుగుణంగా అమ్మవారు అలంకృతురాలై భక్తుల పూజలు అందుకుంది. కన్యకా పరమేశ్వరి ఆలయంలో కొలువుదీరిన అమ్మవారు సంతాన లక్ష్మి అలంకరణతో శోభిల్లగా భక్తజనులు శ్రీ మహా చండి అలంకారంలో భక్తులను అనుగ్రహించారు.

గ్రామాల్లో ఇంటింటి సర్వే

విశాలాంధ్ర-తుళ్లూరు: రాజధాని అమరావతి గ్రామాల్లో ఉపాధి, ఉద్యోగ కల్పన లక్ష్యంగా గ్రామ సచివాలయ, స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది సర్వే నిర్వహిస్తున్నారు. గత నెల 30 వ తేదీన ప్రారంభమైన ఇంటింటి సర్వే కొనసాగుతోంది. 15 నుంచి 59 ఏళ్ల లోపు వయస్సు కలిగిన వారిలో ఏఏ నైపుణ్యాలు ఉన్నాయి. ఇంకా నైపుణ్యాలను మెరుగు పరుచుకోవాలన్న ఆసక్తి వారిలో ఉందా.. విద్యార్హతలు ఏమిటి.. తదితర వివరాలను సేకరిస్తున్నారు. సర్వే వివరాల గురించి సోమవారం ఎంపిడివో శిల్పా కానూరి మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన 'నైపుణ్య గణన' సర్వే మంగళగిరి, రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరు మండలం లోనూ చేపట్టడం జరిగిందని చెప్పారు. బయోమెట్రిక్ ద్వారా గానీ వివరాలు సేకరించడం జరుగుతుందని, ప్రభుత్వ ఉద్యోగుల సమక్షంలో సర్వే జరుగుతుందని ఆమె చెప్పారు. ప్రభుత్వ అదేశాలతోనే సర్వే జరుగుతుందని, అనుమానాలు అవసరం లేదన్నారు. సెప్టెంబర్ 30 న మొదలైన సర్వే నెలరోజుల వ్యవధిలో పూర్తి కావాల్చి ఉందని, ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. మండలంలో 40,700 మంది జనాభా ఉన్నారని, వారిలో విద్యార్హతలు ఉన్న వారితో పాటు లేని వారిలోనూ నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రభుత్వం స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ లు ఏర్పాటు చేసేందుకు నైపుణ్య గణన సర్వే కార్యక్రమం కు శ్రీకారం చుట్టిందని చెప్పారు. స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఈడీ రఘు మాట్లాడుతూ రానున్న రోజుల్లో రాజధాని అమరావతిలో ఏర్పాటయ్యే వివిధ రకాల పరిశ్రమలు, పలు నిర్మాణాలలో అవకాశాలను అందిపుచ్చు కునేందుకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందింప జేసేందుకు నైపుణ్యాభివృద్ధి కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం సంకల్పించిందని చెప్పారు.

ప్రతివారం పరిష్కార వేదికలు : ప్రత్తిపాటి

విశాలాంధ్ర-యడ్లపాడు: ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు వారంవారం మండలాల్లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలు నిర్వహించనున్నట్లు మాజీ మంత్రి, శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. ప్రతి వారం ఒక మండలంలో ఈ వేదిక నిర్వహించి ఎక్కడి సమస్యలకు అక్కడే పరిష్కారం చూపే ప్రయత్నం చేస్తామన్నారు. సంక్షేమ పథకాలకు సంబంధించిన అంశాలతో పాటురెవిన్యూ సమస్యల వరకు ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామన్నారు. యడ్లపాడు ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ సెల్లో మండలంలోని ప్రజల నుంచిభారీగా అర్జీలు అందాయి. అనంతరం వంకాయలపాడు గ్రామంలో 16 లక్షల రూపాయలతో నిర్మించనున్న సీసీ రోడ్డు, ముఖ ద్వార నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు. టీడీపీ నాయకులు కామినేని సాయిబాబు, కందిమళ్ల రఘురామరావు, మద్దినేని వెంకట సుబ్బారావు, రాఘవయ్య పాల్గొన్నారు.

మద్యం షాపులకు దరఖాస్తు చేసుకోండి: మణికంఠ

విశాలాంధ్ర-మాచర్ల: 2024-26 నూతన మద్యం పాలసీలో భాగంగా మద్యం షాపులకు దరఖాస్తు చేసుకునేవారు త్వరితగతిన ఆన్లైన్ లేదా ఆఫ్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని పల్నాడు జిల్లా ఎక్సైజ్ సూపరింటిండెంట్ కె.మణికంఠ తెలిపారు. సోమవారం పట్టణంలోని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దరఖాస్తు చేసుకొనుటకు ఈనెల తొమ్మిదో తేదీ సాయంత్రం ఐదు గంటలకు గడువు ముగుస్తుందన్నారు. ఇక రెండు రోజులే గడువు ఉన్నందున చివర్లో ఆన్లైన్ సర్వర్ బిజీగా ఉంటుందన్నారు. ఆన్లైన్,ఆఫ్లైన్ అందుబాటులో ఉంచామన్నారు. దరఖాస్తు దారులకు చాలా సులభంగా రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ఆన్లైన్‌ను అందుబాటులో ఉంచామన్నారు. దరఖాస్తు చేసుకొనువారు ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డుతో పేరు, ఫోన్ నెంబర్ పొందుపరిచి రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చని అన్నారు. దరఖాస్తు చేసుకున్న వారు రూ.2లక్షలు ఫీజు చెల్లించాలన్నారు. ఫీజు ఆన్లైన్ ద్వారా నైనా లేదా డిడి రూపంలోనైనా చెల్లించవచ్చన్నారు. అవి తిరిగి రావని తెలిపారు. మాచర్ల ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న 10 షాపులకు జనాభాను బట్టి రూరల్‌కు రూ.55 లక్షలు, పట్టణ పరిధిలో రూ.65 లక్షలు స్లాబ్ రేటు నిర్ణయించడం జరిగిందన్నారు. పల్నాడు జిల్లాలో మొత్తం మీద 129 మద్యం షాపులు ఉన్నాయని అందులో మాచర్ల ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో మాచర్ల పట్టణంలో 3, రూరల్ పరిధిలో 2, వెల్దుర్తిలో 3, దుర్గి మండలంలో 2 చొప్పున మొత్తం 10 షాపులకు దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. ఇప్పటివరకు ఈ పది షాపులకు గాను 17 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 11వ తేదీన నరసరావుపేటలోని టౌన్ హాల్లో జిల్లా కలెక్టర్, పోలీసు అధికారుల సమక్షంలో లాటరీ తీస్తారన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ సూపరింటిండెంట్ కే.రవీంద్ర, స్థానిక ఎక్సైజ్ సీఐ ఎన్. వెంకటరమణ, ఎస్ఐ యాకోబ్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో ఉమాదేవి బాధ్యతలు

విశాలాంధ్ర-నూజెండ్ల: మండల అభివృద్ధి అధికారిగా పావులూరి ఉమాదేవి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఉమాదేవి అమరావతి మండలం ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీలలో భాగంగా నూజెండ్ల మండల ఎంపీడీవోగా వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎంపీడీఓ విరభద్రాచారి ప్రకాశం జిల్లా కంభం మండలం బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఉమాదేవి మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలను సందర్శించి, ప్రజా సమస్యల పరిష్కరిస్తూ మండల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. సంక్షేమ పథకాల అమలులో ఎటువంటి సమస్యలు ఉన్నా నేరుగా తనను సంప్రదించాలని అన్నారు. బాధ్యతలు స్వీకరించిన నూతన ఎంపీడీవో ఉమాదేవికి కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్చాలతో స్వాగతం పలికారు.

వైభవంగా రాజగోపుర శిఖర కలశ ప్రతిష్ఠ మహోత్సవం

విశాలాంధ్ర-విజయపురి సౌత్ : మాచర్ల మండలం విజయపురి సౌత్‌లోని శ్రీ సీతారామాలయం రాజగోపుర శిఖర కలశ ప్రతిష్ట మహోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కోలా సుబ్బారెడ్డి ధర్మపత్ని నాగమ్మ, కుటుంబ సభ్యుల సహకారంతో సుమారు కోటి రూపాయలు వెచ్చించి సీతారామాలయానికి రాజగోపుర శిఖర కలశాన్ని ఏర్పాటు చేశారు. గోపుర ప్రారంభ వేడుకలను మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. 9వ తేదీ బ్రహ్మశ్రీ వేదమూర్తులు వట్టిపల్లి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో వేద మంత్రాల నడుమ రాజ గోపుర శిఖర కలశ ప్రతిష్ట మహోత్సవం జరగనుంది. పూర్ణాహుతి, స్వామివారి కల్యాణం అనంతరం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. మహోత్సవ వేడుకల్లో ఆలయ అధ్యక్షులు కోలా వసంత కుమార్ రెడ్డి, కార్యదర్శి రామాంజనేయులు, కోశాధికారి సత్యనారాయణ, సత్తిబాబు, నిమ్మగడ్డ వెంకటేశ్వరావు, రంగారావు, అమర్ కుమార్, నరసింహమూర్తి, సిహెచ్ నాగిరెడ్డి, నాగరాజు, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నందం అబద్దయ్యకు సత్కారం

విశాలాంధ్ర-తాడేపల్లి : రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్‌గా సోమవారం విజయవాడలోని బీసీ భవన్‌లో ప్రమాణ స్వీకారం చేసిన నందం అబద్దయ్యను తాడేపల్లి టీడీపీ పట్టణ నాయకుల తరుపున పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో శిశువును అపహరించిన మాయలేడి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గుంటూరు ప్రభుత్వ సమగ్ర (జీజీహెచ్)ఆసుపత్రిలో అప్పుడే పుట్టిన మగ శిశువు అపహరణకు గురయ్యాడు. దీంతో కొత్తపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే...గోరంట్ల గ్రామానికి చెందిన నసీమా సోమవారం తెల్లవారు జామున (1గంటకు)మగ బిడ్డకు జన్మనిచ్చింది. మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఓ గుర్తు తెలియని మహిళ నసీమా వద్దకు వచ్చి 'బాబు బాగున్నాడు..మా ఆయనకు చూపించుకుని తీసుకొస్తానని చెప్పి తిరిగి రాలేదు. దీంతో నసీమా జీజీహెచ్ ప్రాంగణంలో ఉన్న ఔట్ పోస్ట్ పోలీసులను సంప్రదించి విషయాన్ని వారికి వివరించింది. ఔట్ పోస్ట్ పోలీసుల ద్వారా విషయం తెలుసుకున్న కొత్తపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ స్వయంగా అన్వేషణ ప్రారంభించారు. ఈ అన్వేషణలో భాగంగా బిడ్డను అపహరించిన లేడీని అచ్చంపేట మండలం పోనూరులో బిడ్డ ఆచూకీ లభ్యమైందని సమాచారం.

ఎస్సీ వర్గీకరణ, క్రిమీలేయర్‌కు వ్యతిరేకంగా మాల సంఘాల జేఏసీ ఏర్పాటు

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: ఎస్సీ వర్గీకరణ, క్రిమిలేయర్‌కు వ్యతిరేకంగా స్థానిక ఏసీ కాలేజీలోని సమావేశ మందిరంలో మాల కుల సంఘాల ఆధ్వర్యంలో సోమవారం మాల సంఘాల జేఏసీ ఏర్పాటు చేశారు. మాల సంఘాల జేఏసీ చైర్మన్‌గా రిటైర్డ్ ఐఆర్ఎస్ ఉప్పులేటి దేవి ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పాండు అశోక్, కన్వీనర్‌గా అన్నవరపు కిషోర్, గుంటూరు నగర అధ్యక్షులుగా నల్లపు నీలాంబరం, కన్వీనర్‌గా గోళ్ల అరుణ్ కుమార్ మొదలగు వారితో జేఏసీ కార్యవర్గ కమిటీ నియమించినట్లు మాల సంఘాల జేఏసీ పేర్కొంది. నవంబర్ 26 రాజ్యాంగ ఆమోద దినోత్సవ సందర్భంగా భారీ బహిరంగ సభ నిర్వహించాలని తలంచామనీ రిజర్వేషన్ ముఖ్య ఉద్దేశం.... వాటిని నిర్వీర్యం చేసెందుకు చేసే ప్రయత్నాన్ని తిప్పుకొట్టాలనే ఉద్దేశంతో సమావేశమైనట్లు జేఏసీ నాయకులు తెలిపారు. మాల, ఉప కులాలకు ఎలాంటి నష్టం వాటిల్లిన మేము ఎట్టి పరిస్థితుల్లో ఒప్పుకోమని మాల సంఘాల జేఏసీ తెలిపింది.

పలస్తీనాపై దాడులు ఆపాలని వామపక్షాల నిరసన ర్యాలీ

విశాలాంధ్ర-మంగళగిరి: పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను వెంటనే నిలిపివేయాలని ప్రపంచ దేశాలు ఈ దాడులను ఖండించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య అన్నారు. సోమవారం మంగళగిరి పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను నిరసిస్తూ, సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో సభను ఏర్పాటు చేశారు. అనంతరం సీపీఎం కార్యాలయం నుంచి టిప్పర్ల బజార్, గౌతమ బుద్ధ రోడ్డు మీదగా పాత బస్టాండ్ వరకు కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య మాట్లాడుతూ పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులు మూడో ప్రపంచ యుద్ధానికి దారి తీస్తాయన్నారు. ఇరుదేశాల మధ్య ఉన్న అనేక అంతర్గత సమస్యలు నేడు జరుగుతున్న భయంకరమైన మారణ హోమం ద్వారా పరిష్కారం కాదని, ఈ మారణ హోమం ద్వారా పసిపిల్లలు, వృద్ధులు మహిళలు వేలాదిమంది అమాయకులు మరణించారని లక్షలాదిమంది నిరాశ్రయులయ్యారని తిరుపతయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్, సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ఎస్ చెంగయ్య, సీపీఎం సీనియర్ నాయకులు జైవి రాఘవులు మాట్లాడుతూ ఇజ్రాయిల్ దురాక్రమ యుద్ధానికి ఈరోజుతో సంవత్సరం గడుస్తుందని యుద్ధం ప్రపంచ శాంతికి ముప్పుగా మారే ప్రమాద దశకు చేరుకుందని వారు అన్నారు. ఇజ్రాయిల్ దురాక్రమణకు అడుగడుగునా అమెరికా వత్తాసు పలుకు తుందని అన్నారు. తక్షణమే యుద్ధాన్ని ఆపాలని వారు డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు జవ్వాది సాంబశివ రావు, ఎస్కే కరీముల్లా, పంతగాని మరియదాసు, గోహార్ జానీ, నరేంద్ర, హనోక్ బాబు, ఏఐటీయూసీ గుంటూరు జిల్లా సహాయ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని సత్యనారాయణ, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గండికోట దుర్గారావు, సిపిఎం నాయకులు పి బాలకృష్ణ, సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు వివి జవహర్లాల్, ఎం బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు సకాలంలో పరిష్కరించాలి: కలెక్టర్

విశాలాంధ్ర-తెనాలి : ప్రజల సమస్యలు సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. రామకృష్ణ కవి కళాక్షేత్రంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమం జరిగింది. పట్టణ పరిసర ప్రాంతాల నుండి ప్రజలు సుమారుగా 50 మంది పాల్గొని వారి సమస్యలను కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. అధికారులను, ఉద్యోగులను ఆ సమస్యల వివరాలను గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రజలు కూడా తమ సమస్యలను తెలియజేస్తుంటే పరిష్కారం చేస్తారని ఆమె వారికి తెలియజేశారు. సిపిఎం కమిటీ కార్యదర్శి కొల్లిపర బాబూప్రసాద్, హుస్సేన్‌వలి, శ్రీనివాస రావులు ఈ కార్యక్రమంలో పాల్గొని పట్టణంలోని పలు సమస్యలపై అర్జీలు ఇచ్చారు. రోడ్లు ప్రమాదకరంగా ఉన్నాయని, వర్షంకురిస్తే ప్రజలు నడవడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. చెంచుపేటలో వాటర్‌లైన్ డామేజ్ అయిందని, నీరు వృధాగా పోతుందని, పైప్‌లైన్లలో మట్టి బురద కలవడం వలన ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని వాటిని వెంటనే మరమ్మతులు చేయాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ బి.శేషన్నను అన్ని సమస్యలు పరిష్కరించాలని ఆదేశమిచ్చారు. అర్జీలు ఇవ్వడానికి వచ్చిన ప్రజలను గౌరవించే విధంగా తగు ఆదేశాలు జారీ చేస్తామని హామీ ఇచ్చారు.

వర్సిటీలో వైల్డ్ లైఫ్ వారోత్సవం

విశాలాంధ్ర-మంగళగిరి : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఆంధ్రప్రదేశ్ బయోడైవర్సిటీ బోర్డ్ ఆధ్వర్యంలో సోమవారం వైల్డ్ లైఫ్ వారోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు వైల్డ్ లైఫ్‌పై అవగాహన కల్పించారు. ముఖ్యంగా భారతదేశంలో వైల్డ్ లైఫ్ పరిస్థితులు, వలస పక్షులను ఎలా కాపాడుకోవాలి, బయోడైవర్సిటీకి సంబంధించి వాతావరణం మార్పులు, అందుకు నేటి యువత తీసుకోవలసిన బాధ్యతలను వివరించారు. అనంతరం బయోడైవర్సిటీ వైల్డ్ లైఫ్‌పై వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రధానం చేశారు. వారోత్సవంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ బయోడైవర్సిటీ బోర్డ్ మెంబర్ సెక్రెటరీ బీవీఏ కృష్ణమూర్తి హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. నేటి విద్యార్థులు డైవర్సిటీ పట్ల అవగాహన పెంచుకోవాలని భవిష్యత్ తరాల మనుగడకు బయోడైవర్సిటీని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో డబ్ల్యుడబ్ల్యుఎఫ్ నుంచి ఫరీదా, బయోడైవర్సిటీ బోర్డు ఆర్‌బీసీ షేక్ గాలిబ్, అమరావతి బోటింగ్ క్లబ్ సీఈవో డాక్టర్ తరుణ్ కాకాని, ఎన్‌సీసీ వలంటీర్లు, పీజీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-అమరావతి: గ్రామాల్లో రెవిన్యూ సమస్యల పరిష్కారానికి మండల ఉన్నత అధికారులు సమయస్ఫూర్తితో వ్యవహరించాలని పెద్దకూరపాడు నియోజకవర్గ శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ అన్నారు. సోమవారం అమరావతిలోనే మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ప్రజాదర్బార్ కార్యక్రమానికి అధ్యక్షత వహించి ప్రసంగించారు. ప్రవీణ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ఉన్నత అధికారులు గ్రామసభలు నిర్వహించి స్థానిక సమస్యలతో పాటు రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలని కోరారు. సోమవారం నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. అర్జీలను పరిశీలించి స్థానిక అధికారులతో సమావేశంలో వాటిని చర్చించి పరిష్కార మార్గం వైపుకు తీసుకెళ్లి తగు ప్రజలకు న్యాయం చేయనున్నట్లు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీడీవో ఈ పార్వతి, స్థానిక తహసిల్దార్ నాగమల్లేశ్వరరావు, ఎంపీపీ మేకల హనుమంతరావు యాదవ్, మాజీ జడ్పిటిసి తెలుగుదేశం, పార్టీ నాయకులు ఎస్కే జానీ, బి వెంకటేశ్వరరావు ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE GUNTUR DISTRICT :: GUNTUR

TR.O.P. No: 800/2023

Between:
Narayanam Annapurna Kasi Visalakshi - Petitioner
And
Chintalapati Hanumayamma and others - Respondents

NOTICE

To
2) Ch. Venkata Purna Sri Rama Murthy, S/o Lakshmi Narasimham. R/o. Opp: Anjaneya Residency, 2/1 Bradipet, G.M.C-100, Guntur.
3) Chintalapati Satish Kumar, S/o. Lakshmi Narasimham, R/o. D.No: 3-464/1, Polakampadu 522 501, Guntur Dist.
6) Kommineni Satish, S/o Kommineni Rama Rao, R/o D. No:2-226 Krosuru - 522 410, Krosuru Mandal, Guntur Dist.
8) Guggilam Vijaya Sekhar, S/o Upendra Rao, R/o D.No: 3-377 Krosuru Village - 522 410, Krosuru Mandal, Guntur Dist.
9) Avula Ankireddy, S/o Venkata Ramana Reddy, R/o D.No: 4-182, Krosuru - 522 410, Guntur Dist.
10) Katam Venkata Reddy, S/o Sundara Ramireddy, R/o Dodlaru Village -522 410, Krosuru Mandal, Guntur Dist.
16) Manku Govinda Rao, S/o. Pedda Saidayya, R/o. D.No: 2-27/A, VANNIYA PALEM Bellamkonda Mandal, Guntur Dist.,
17) Manku Madhava Rao, S/o. Pedda Saidayya, R/o. D.No: 2-27/A, VANNIYA PALEM Bellamkonda Mandal, Guntur Dist.,

Please take notice that the petitioner was filed above Transfer Original petition against all of you and others and the same stands posted to **25-10-2024** for appearance on that day at **10-30 a.m.**, either to person or through an advocate failing which the matter will be heard and determined in your absence.

(By order of this Hon'ble Court)

Advocate for Petitioner
Akula Sandhya, A. Lakshmi Bhavani
Advocates, Guntur.
Cell No: 944 123 9699, 9491610840
Vijayawada, Dt: 07-10-2024

రోడ్లపై ర్యాంపులు, డ్రైన్లపై నిర్మాణాలు చేయొద్దు: కమిషనర్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : నూతనంగా నిర్మాణం చేసే బహుళ అంతస్తు భవనాలు రోడ్ల మీదకు ర్యాంప్‌లు, డ్రైన్లపై నిర్మాణాలు చేయకుండా, డ్రైనేజి లైన్‌ని మేజర్ డ్రైన్‌లోకి కనెక్ట్ చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేసిన భవనాలకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్(ఓసీ) జారీ చేయబోమని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. స్థానిక కోదండరామయ్య నగర్, గోరంట్ల, పెద్ద పలకలూరు రోడ్, కాకాని రోడ్, ఆర్టీసీ కాలనీ తదితర ప్రాంతాల్లో ఆక్యుపెన్సి సర్టిఫికెట్‌కి దరఖాస్తు చేసుకున్న భవనాలను కమిషనర్ సోమవారం పరిశీలించారు. సెట్ బ్యాక్, రోడ్ల కొలతలు, ర్యాంప్‌లు, డ్రైన్లపై ఆక్రమణలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకు మాత్రమే నగరంలో బహుళ అంతస్తు భవనాలు నిర్మాణాలు జరగాలని, నిబంధనలు ఉల్లంఘన చేస్తే తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళిక అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తున్నామన్నారు. భవనాలు నిర్మాణ దశలో వార్డ్ సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు నిరంతరం పరిశీలిస్తూ, నిబంధనల మేరకు నిర్మాణాలు చేపట్టకుంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చి, నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ఆర్టీసీ కాలనీలో డ్రైన్‌ని ఆక్రమించి ర్యాంప్‌లు చేసిన నిర్మాణం గమనించి సంబంధిత ప్లానింగ్ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్ల మీదకు ర్యాంప్‌లు, డ్రైన్ల ఆక్రమణలు లేకుండా చర్యలు తీసుకోవాలని, ఇప్పటికే నిర్మాణం చేసిన వాటిని తొలగించాలని స్పష్టం చేశారు. ప్రధానంగా సెట్ బ్యాక్ పోర్షన్‌లో ఏ విధమైన నిర్మాణాలు చేయకూడదని, జనరేటర్లు కూడా పెట్టడానికి వీలులేదన్నారు. ర్యాంప్‌లు రోడ్ మీద వరకు రాకూడదని, గ్రీనరీకి కేటాయించిన విధంగా ఉండాలన్నారు. వాచ్ మెన్ రూమ్ నగరపాలక సంస్థ నుంచి అనుమతి పొందిన ప్లాన్ ప్రకారమే ఏర్పాటు చేసుకోవాలన్నారు. అపార్ట్‌మెంట్ నిర్మాహకులే డ్రైనేజి లైన్‌ను మేజర్ డ్రైన్ వరకు కనెక్ట్ చేసుకోవాలని అన్నారు. పర్యటనలో సిటీ ప్లానర్ డి.రాంబాబు, టీపీఎస్‌లు లక్ష్మణ స్వామి, సువర్ణ కుమార్, రసూల్, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

LOSS OF PASSPORT

I, **SHAIK NOORLLA (Cell: 9440691684)** S/o. **Shaik Meera Saheb,** R/o. Door No. 19-03-103, Chekkala Bazar, Chinna Masjid, Sangadigunta, Guntur, Guntur District, AP. I lost my **Passport No. J5093634** while I was shifting my house from Lanchester Road to Chekkala Bazar, Sangadigunta on 01-10-2024. If anybody finds it, please inform me.

బహిరంగ ప్రకటన

నా క్లయింటు అయిన గుంటూరు జిల్లా, మంగళగిరి,శివాలయం వీధి, డోరు నెం.30-80 ఎరు కావురన్నలు గట్టెం వీరాస్వామి గారి కుమారుడు గట్టెం సురేష్ (సెల్: 9110343489) గారి నంజాయిషీ పొంది యావన్మందికీ తెలియజేయునది.

నా క్లయింటు పేరిట నల్లపాడు గ్రామ డి.నెం.225రు, మీనాక్షి ట్రిడెంట్ అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ నెం.301రు కలదు. సదరాస్తి నా క్లయింటు పేరిటకు ది.29-07-2015న విక్రయ దస్తావేజు నెం.6456/2015రుగా నల్లపాడు సబ్ రిజిస్ట్రారు ఆఫీసులో రిజిష్టరు కాబడినది. ఈ దస్తావేజుతో పాటు నా క్లయింటు వల్లంరెడ్డి శ్రీనివాసరెడ్డి గారికి ది.12-01-2016న విక్రయించి నల్లపాడు సబ్ రిజిస్ట్రారు ఆఫీసులో రిజిష్టరు జరిపించిన దస్తావేజు నెం. 326/2016 మరియు ది. 09-02-2017న తాడికొండ సబ్ రిజిస్ట్రారు ఆఫీసులో రద్దుపర్చిన దస్తావేజు నెం. 865/2017 మొత్తం మూడు ఒరిజినల్ దస్తావేజులను తీసుకుని బైకుపై నాక్లయింటు పెదకాకాని నుండి మంగళగిరి వెలుచున్న క్రమంలో పెదకాకాని నుండి కాజ టోల్‌గేట్ మార్గమధ్యలో ఎక్కడో పడిపోయినవని తెలియజేయడమైనది. కావున సదరు దస్తావేజులు ఎవరికైనా దొరికిన యెడల నాకు గానీ, నా క్లయింటునకు గానీ అందజేసిన యెడల తగిన పారితోషికము ఇవ్వబడును. అలాగే సదరాస్తి విషయమై ఎవరికైనా ఎటువంటి అభ్యంతరాలు, ఆక్షేపణలు ఉన్న యెడల ఈ ప్రకటన ప్రచురితమైన తేది నుండి 15 రోజులలోగా నాకు గానీ నా క్లయింటునకు గానీ తెలియజేయగలరు.

ఇట్లు : సయ్యద్ ఆసిఫ్ అలీ, అడ్వకేట్
కొబాల్డ్‌పేట, గుంటూరు. సెల్ : 93941 55522

దాడులు ఆపాలని వామపక్షాల నిరసన

విశాలాంధ్ర-తుళ్లూరు: ఇజ్రాయిల్ సైన్యం పాలిస్తీనాపై చేస్తున్న యుద్ధాన్ని ఆపేయాలని కోరుతూ తుళ్లూరులో సోమవారం వామపక్ష నేతలు నిరసన తెలిపారు. సీపీఐ నాయకులు కె.ఈశ్వరరావు మాట్లాడుతూ ప్రపంచ శాంతికి ముప్పు తెస్తున్న ఇజ్రాయిల్ చర్యలను ఖండించాలని కోరారు. ప్రపంచ శాంతి కోసం ఐక్యరాజ్యసమితి చేసిన తీర్మానంపై భారత ప్రభుత్వం సంతకం చేయాలని అన్నారు. సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి మాట్లాడుతూ పాలిస్తీనులపై ఇజ్రాయిల్ దురాక్రమణను ఆపాలి. ఆక్రమిత ప్రాంతాల నుంచి ఇజ్రాయిల్ సైన్యం వైదొలగాలని ఐక్యరాజ్యసమితి చేసిన తీర్మానానికి కట్టుబడాలని ఆయన తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం భాగ్యరాజు, వల్లభాపురం వెంకటేశ్వరరావు, సిపిఎం రాజధాని డివిజన్ నాయకులు పేరం బాబురావు, షేక్ జాని, చింతల భాస్కర్ రావు, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు జెట్టి నరేంద్ర, సిపిఐ నాయకులు గుర్రంకొండ సత్యానందం, దేవుని దయ, తదితరులు పాల్గొన్నారు.

పీఎంజే జ్యువెల్స్ నూతన స్టోర్ ప్రారంభం

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: స్థానిక లక్ష్మీపురంలో పీఎంజే జ్యువెల్స్ నూతన షోరూంను పశ్చిమ నియోజక వర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి సోమవారం ముఖ్యఅతిథిగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీఎంజే జ్యువెల్స్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధినేత హైదర్ అలీ, క్లస్టర్ మేనేజర్ కందకూరి అరవింద్ కుమార్, గుంటూరు స్టోర్ మేనేజర్ మహేష్ కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హైదర్ అలీ మాట్లాడుతూ వినియోగదారుల అభిరుచులను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేకంగా ఈ స్టోర్ క్యూరేట్ చేయబడింది. వజ్రాలు, బంగారం, విలువైన రాళ్లలో డిజైన్ల విస్తృత ప్రదర్శనను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అత్యుత్తమ, డిజైనర్ ఆభరణాల శ్రేణి ఈ స్టోర్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని తెలిపారు. వినూత్నంగా డిజైన్ చేసిన డైమండ్ బ్రైడల్ ఆభరణాలు ఈ తరం ఫ్యాషన్ ఔత్సాహికులకు ఏకైక వేదికగా పీఎంజే నిలుస్తుందని, కస్టమర్లందరికీ అబ్బురపరిచే డిజైనర్ శ్రేణిని అందజేస్తున్నట్టు తెలిపారు.

నూరి ఫాతిమాను కలిసిన డైమండ్‌బాబు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గుంటూరు నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు (డైమండ్ బాబు) వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గుంటూరు నగర అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా డైమండ్ బాబు సోమవారం మంగళదాస్ నగర్‌లో ఉన్న గుంటూరు తూర్పు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త షేక్.నూరి ఫాతిమాను ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువ కప్పి పూలబొకే అందజేశారు. పూలబొకే అందజేసిన వారిలో చింతా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లలిత త్రిపుర సుందరిదేవిగా అమ్మవారు

విశాలాంధ్ర-అమరావతి : శ్రీ బాల చాముండిక సమేత అమరేశ్వర స్వామి దేవాలయంలో శరన్నవరాత్రుల్లో భాగంగా ఐదో రోజున శ్రీ బాల చాముండిక దేవిని లలిత త్రిపుర సుందరిగా అలంకరణతో దర్శనమిచ్చారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ధరలను అరికట్టకపోతే... ప్రజా నిరసన తప్పదు: జంగాల

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : రోజురోజుకు పెరిగిపోతున్న నిత్యావసర సరుకుల ధరలు అరికట్టకపోతే... ప్రభుత్వాలకు ప్రజా నిరసన తప్పదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ హెచ్చరించారు. గుంటూరు మల్లయ్యలింగంభవన్ నుంచి వీడియో సందేశాన్ని సోమవారం విడుదల చేశారు. దేశంలో, రాష్ట్రంలో తీవ్రమైన కరువు పరిస్థితులు ఎదుర్కొంటున్న పేద, మధ్య తరగతి, సామాన్య ప్రజానీకానికి పెరుగుతున్న ధరలు తలకు మించిన భారంగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ధరల పెరుగుదల ఎక్కడి వరకు ఉంటుందో అర్థం కాని పరిస్థితుల నేపథ్యంలో కాయకష్టం చేసుకునే కుటుంబాలు మార్కెట్‌కు వెళ్లి సరుకులు కొనాలంటే భయపడే స్థితి ఉందని అన్నారు. కందిపప్పు, ఉల్లిపాయలు, టమోట, బంగాళ దుంప, బియ్యం, గోదుమ పిండి ఇలా చెప్పుకుంటూ పోతే ఆకాశాన్ని అంటే ధరలతో ప్రజలు సతమతమౌతున్నారని అన్నారు. కేంద్రంలో నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చాక పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్‌లు లెక్కలేనన్ని సార్లు పెంచారని, వీటి ప్రభావం నిత్యావసరాలపై పడి వాటి ధరలు నింగినంటాయని అన్నారు. వంద రోజులలో ధరలు తగ్గిస్తామని చెప్పి గద్దె నెక్కిన మోదీ ఆ దిశగా కనీసం ప్రయత్నం కూడా చేయక పోవడం శోచనీయమని అన్నారు. రాష్ట్రంలోని గత, ప్రస్తుత ప్రభుత్వాలు కూడా ధరల నియంత్రణకు చర్యలు చేపట్టకపోవడం దారుణమని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ప్రజా ఆగ్రహానికి గురికాకతప్పదని హెచ్చరించారు.

పలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను వ్యతిరేకిస్తూ ర్యాలీ

విశాలాంధ్ర-పొన్నూరు: పలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను వ్యతిరేకిస్తూ వామపక్ష పార్టీల పిలుపులో భాగంగా సోమవారం పొన్నూరు హైలాండ్ సెంటర్లో సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగినది. ఈ సందర్భంగా పొన్నూరు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు మాట్లాడుతూ గాజా పట్టణంపై ఇజ్రాయిల్ దాడి ప్రారంభించి ఈ రోజుకు సంవత్సరం పూర్తి అవుతుందన్నారు. ఈ దాడిలో షుమారు 85వేల మందికిపైగా మరణించారని ప్రముఖ మెడికల్ జర్నల్ "లాన్సెట్" అంచనా వేసిందన్నారు. అధికార లెక్కలు మాత్రం 45వేల మంది లెబనాన్ పౌరులు మరణించినట్లు ప్రకటించిందన్నారు. ఇజ్రాయిల్ భీకర కాల్పుల్లో పిల్లలు, మహిళలు, వృద్దులు ఎక్కువ మంది మరణించారని, పాఠశాలలో, వైద్యశాలలు, జనాభా రద్దీగా వుండే అనేక ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని దాడులు కొనసాగిస్తున్నారని, లెబనాన్‌లోని హమాస్ సంస్థను లక్ష్యంగా చేసుకుని కీలక నాయకులను మట్టుపెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అంతర్జాతీయ న్యాయస్థానం కాల్పులు విరమించమని, దాడులు ఆపాలని తార్మానం చేసినా అమెరికా మద్దతుతో కాల్పుల విరమణ ఒప్పందాన్ని ప్రక్కన పెట్టి దాడులు కొనసాగిస్తున్నారన్నారు. వాకీటాకీలు, పేజర్ల వంటి అధునాతన యంత్రాల ద్వారా ఇజ్రాయిల్ దాడులు కొనసాగిస్తున్నదని, లెబనాన్ జాతిని అంతం చేయడమే లక్ష్యంగా యుద్ధం కొనసాగుతుందన్నారు. ప్రపంచ వ్యాపితంగా ఇజ్రాయిల్ యుద్దోన్మాదానికి వ్యతిరేకత వ్యక్తమవుతున్నా లెక్కచేయడం లేదని, ఇది మూడవ ప్రపంచ యుద్ధానికి దారితీసే ప్రమాదముందన్నారు. ఇజ్రాయిల్ దేశం ఇప్పటికైనా యుద్ధం నిలిపి వేసే విధంగా చర్యలు చేపట్టి ప్రపంచ శాంతిని నెలకొల్పే విధమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. దేవరకొండ శీను, శ్రీనివాస్, ఆర్ శ్రీనివాసరావు, షేక్ అనీఫ్, సీతారామయ్య, వీర రాఘవులు, శ్రీను, సంసోన్, బేతాళ ప్రకాష్ రావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-చిలకలూరిపేట: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మహిళా సమాఖ్య ఏరియా కార్యదర్శి చెరుకుపల్లి నిర్మల కోరారు. సోమవారం ఇటీవల బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబును ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ షేక్ సుభాని, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు చెంచయ్య తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ పారిశుధ్యం మెరుగుపరచటానికి కార్మికులు పూర్తి స్థాయిలో సహకరిస్తారని వెల్లడించారు. పారిశుధ్య అవసరాలకు సరిపడా కార్మికులను నియమించాలని, వారికి వృత్తి పరికరాలు, రక్షణ పరికరాలు సరఫరా కోరారు. ఇందుకు కమిషనర్ సానుకూలంగా స్పందించారు.

మంత్రి నాదెండ్ల దంపతుల పూజలు

విశాలాంధ్ర-తెనాలి : పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో జరుగుతున్న దేవీ శరన్నవరాత్రులలో సోమవారం మంత్రి నాదెండ్ల మనోహర్ దంపతులు పాల్గొని విశేష పూజలు నిర్వహించారు. పూజారులు, దేవస్థాన కమిటీ సభ్యులు వారిని ఆహ్వానించారు. అనంతరం పట్టణంలోని శివాజీచౌక్ కాళీమాత గుడి, నందులపేటలోని సాయిబాబా మందిరం నందు దాగే వారి వీధి, మారీస్‌పేటలోని శివాలయం జరిగిన పూజా కార్యక్రమాల్లో వారు పాల్గొన్నారు.

మిథున్ చక్రవర్తికి అభినందనలు

విశాలాంధ్ర-తెనాలి : ప్రముఖ బెంగాలీ నటుడు మిథున్ చక్రవర్తిని భారతదేశ అత్యున్నత పురస్కారం దాదాసాహెబ్‌ఫాల్కే అవార్డుకు ఎంపిక పట్ల మా-ఏపి వ్యవస్థాపకుడు దిలీప్ రాజా వారి బృందం అభినందనలు తెలిపారు. మిథున్ చక్రవర్తికి గతంలో రెండు పర్యాయాలు జాతీయ అవార్డు, ఉత్తమ నటుడు అవార్డు వచ్చిందని పేర్కొన్నారు. దర్శకుడు కనపర్తి రత్నాకర్, నటుడు మిలటరి ప్రసాద్ తదితరులు ఆయనకు అభినందనలు తెలిపారు.

ఘనంగా చండీహోమం

విశాలాంధ్ర-పెదకూరపాడు : మండల పరిధిలోని 75 తాళ్ళూరులో సోమవారం శ్రీ చండీ హోమం నిర్వహించారు. దసరా ఉత్సవాల్లో శ్రీ కాశీ అన్నపూర్ణ విశ్వేశ్వరస్వామి ఆలయంలో 5వ రోజు అమ్మవారిని శ్రీ చండీదేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా శ్రీ చండీదేవికి 13 అనువాకాలతో హోమం నిర్వహించి పూర్ణాహుతి చేశారు. యాజ్ఞిక బ్రహ్మసాయి సుబ్రహ్మణ్య రాఘవశర్మ, బసవరాజు సుబ్రమణ్య శర్మ హోమం క్రతువు నిర్వహించారు. ఆలయ పూజారులు హనుమంతరావు శర్మ, హరినాధ శర్మ భక్తులకు చండీ విశిష్టతను వివరించారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. అనంతరం విచ్చేసిన భక్తులకు ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. శ్రీ శివసాయి ట్రస్టు సభ్యులు నిర్వాహణలో అన్నప్రసాద వితరణ చేశారు.

కదంబ వనవాసినిదేవి అలంకారంలో భ్రమరాంబ అమ్మవారు

విశాలాంధ్ర-పెదకాకాని : శ్రీ మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో దసరా నవరాత్రుల 5వ రోజు సోమవారం శ్రీ కదంబ వనవాసినిదేవి అలంకారంలో భ్రమరాంబ అమ్మవారు భక్తులను అనుగ్రహించారు. నవరాత్రులు పర్వదినములలో వివిధ ప్రత్యేక అలంకారాలలో శ్రీ భ్రమరాంబ అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారని ఆలయ ఉపకమిషనరు గోగినేని లీలాకుమార్ తెలిపారు. సోమవారం ఉభయదాతలుగా బోయపాటి వెంకటరమణ తదితరులు ప్రత్యేక పూజలలో చండీ హోమాలలో పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా కాల్‌శ్రీ డాన్స్ అకాడమీ, పెదకాకాని వారిచే కూచిపూడి నృత్యం, ఉప్పలపాటి సైదులు, ఉప్పలపాడు వారిచే శ్రీ కృష్ణరాయభారం నాటకం నుంచి పడకసీను, కె.శ్రీనివాసరావు, గుంటూరు వారిచే శ్రీ కృష్ణరాయభారం నాటకం నుంచి సెంటర్ సీను కార్యక్రమాలు జరిగాయి.

పీఆర్సీ కమిటీ వేసి తక్షణమే ఐఆర్ ప్రకటించాలి

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : గత ప్రభుత్వం వేసిన పీఆర్సీ కమిటీని రద్దు చేసినప్పటికీ... ఇంతవరకు కొత్త కమిటీని ఏర్పాటు చేయలేదని, పాత పీఆర్సీ గడువు దాటి ఒక సంవత్సరం అయిపోయిందని కాబట్టి తక్షణమే పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేసి అప్పటివరకు 30 శాతం ఐఆర్ ప్రకటించాలని ఏపీటీఎఫ్ జాతీయ ఆర్థిక కార్యదర్శి జోసెఫ్ సుధీర్ బాబు డిమాండ్ చేశారు. గుంటూరు కంకరగుంటలోని ఎస్టీయూ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు డి.పెదబాబు అధ్యక్షతన జిల్లా ముఖ్యుల సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశంలో జోసెఫ్ సుధీర్ బాబు మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల భవితవ్యాన్ని నిర్వీర్యం చేస్తున్న జీఓ 117ను తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు చేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన ప్రభుత్వం, ఆరు నెలల గడిచినా ఇంత వరకు దాని గురించి పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దార్ల పెద బాబు, డీకే సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఫిబ్రవరి నెల నుంచి పెండింగ్‌లో ఉన్న పీఎఫ్ లోన్లు, ఏపీజీఎల్ఐ లోన్లను వెంటనే విడుదల చేయాలని, 2022 ఏప్రిల్ నుంచి పెండింగ్‌లో ఉన్న ఈఎల్ ఎన్కాష్‌మెంట్‌ను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఇంకా పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ అరియర్స్, డీఏ అరియర్‌లను కూడా విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. న్యాయబద్ధమైన తమ డిమాండ్లను తక్షణమే నెరవేర్చనట్లయితే... ఎస్టీయూ గుంటూరు శాఖ పక్షాన తగు కార్యాచరణ ప్రణాళికను ప్రకటిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షులు ఏవీ ప్రసాద్ బాబు, రాష్ట్ర కౌన్సిలర్ డీఏ జోసెఫ్, షేక్ బాజీ, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు వై.శ్యాంబాబు, వివిధ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

సెంచరీ కొట్టిన 'టమోట' ధర

విశాలాంధ్ర అవనిగడ్డ : మార్కెట్‌లో టమోట ధరలు రోజు రోజుకు పెరుగుతూ సామన్య ప్రజల నడ్డివిరుస్తున్నాయి. సాధారణంగా వర్షాకాలంలో కూరగాయల ధరలు తగ్గాలి. ఈ సంవత్సరం మాత్రం అందుకు భిన్నంగా కూరగాయల ధరలు ఆకాశానంటుతున్నాయి. ముఖ్యంగా అందరూ మెచ్చే టమోట చుక్కలు చూపిస్తూ కిలో ధర 100కు పైబడి పలుకుతుండటంతో టమోటకి అందరూ బై బై చెబుతున్నారు. కిలో రైతు బజార్‌లో రూ.60 ఉండగా రూ.90 నుండి రూ.110 వ్యాపారులు అమ్ముతున్నారు. ఇదేమి అని కొనుగోలుదారులు ప్రశ్నిస్తే మొత్తగా ఉండే టమోటలు ఆ ధరలకు వస్తాయని, మార్కెట్‌లో విక్రయదారులు చెబుతున్నారు. దీంతో మధ్యతరగతి వినియోగదారులు టమోట వైపు చూడాలంటేనే భయపడుతున్నారు. ఇటీవల వచ్చిన వర్షాలు, వరదల కారణంగా లంక గ్రామాల్లోని లంక తోటలు ముంపుకు గురికావడంతో ఒక్కసారిగా కూరగాయల ధరలకు రెక్కలు వచ్చి ఆకాశాన్ని అంటాయి.

క్రీడలతో మానసిక ఉల్లాసం

విశాలాంధ్ర-విజయవాడ: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని చుట్టుగుంటలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాల డీన్ గుంటూరు హరిబాబు అన్నారు. రవీంద్రనాథ్ ఠాగూర్ భవన్‌కు చెందిన పలువురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ సమాఖ్య(ఎస్‌జీఎఫ్) అండర్-19 తైక్వాండో పోటీలకు హాజరై పతకం సాధించారని తెలిపారు. ఈ నెల 4, 5న కడప జిల్లా రైల్వేకోడూరులో నిర్వహించే ఈ పోటీల్లో యు.శ్యామ్‌కుమార్ ఎంపికైనట్లు చెప్పారు. ఇంటర్ ఫస్టియర్ విద్యార్థి ఉప్పు శ్యామ్ కుమార్ అండర్ 19 తైక్వాండో రాష్ట్ర స్థాయి పోటీలో రజత పతకం సాధించిన సందర్భంగా సోమవారం అభినందనలు తెలిపారు. త్వరలో అతనిని జాతీయ స్థాయి పోటీలకు పంపనున్నట్లు చెప్పారు. ఈ సర్టిఫికెట్లు విద్యార్థులకు భవిష్యత్తులో విద్యా ఉపాధి ఉద్యోగ అవకాశాలు పెంపుదలకు దోహదపడుతుందన్నారు. క్రీడలతో విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెంపుతుందని ప్రిన్సిపాల్ నిజాంపట్నం గోకర్ణేశ్వరరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం కొమ్మినేని రంగారావు, శాఫ్ కోచ్ గౌరీశంకర్, జిల్లా తైక్వాండో సంఘం కార్యదర్శి ఎం. అంకమ్మరావులు పాల్గొని అభినందించారు.

రాజ్యలక్ష్మీ అమ్మకు విశేష పూజలు

విశాలాంధ్ర అవనిగడ్డ : గీతామందిరంలోని రాజ్యలక్ష్మీ అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాజ్యలక్ష్మీ అమ్మవారు బత్తాయి, కూరగాయల అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ముందుగా ధర్మకర్త శ్రీహరిబాబు అమ్మవారికి పంచామృతాలతో విశేష అభిషేకాలు నిర్వహించగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అమ్మవారికి సహస్ర నామాలతో కుంకుమ అర్చనలు, సువర్ణ పుష్పాలతో అర్చనలు చేసి విశేష పూజలు నిర్వహించారు. అర్చక స్వాములు దివి నరసింహమూర్తి , బాలకృష్ణమాచార్యులు, ఆదిత్యాలు భక్తులకు తీర్థప్రసాదాలను వితరణ చేశారు.

అమెజాన్ ఇండియా డయల్ 4242 సహకారంతో అంబులెన్స్ సేవలు

విశాలాంధ్ర - విజయవాడ (వన్ టౌన్) : భాగస్వామి శ్రేయస్సు కోసం తన నిబద్ధతను బలోపేతం చేస్తూ, అమెజాన్ ఇండియా డయల్ 4242 సహకారంతో డెలివరీ భాగస్వామి కోసం అంబులెన్స్ సేవలను ప్రారంభించింది. ఈ ప్రయత్నం సురక్షత చర్యలను మెరుగుపరచడంతో పాటు, డెలివరీ అసోసియేట్‌ల ఆరోగ్యానికి ప్రాధాన్యత నిస్తుంది. అదనంగా, అమెజాన్ డెలివరీ సర్వీస్ పార్టనర్, వారి డెలివరీ అసోసియేట్‌లు, ఐ హావ్ స్పేస్, ఫ్లెక్స్ కార్యక్రమాలలో 50 వేల మంది భాగస్వాములకు ప్రయోజనాన్ని చేకూర్చే ఆరు నెలల సమగ్ర ఆరోగ్య క్యాంపెయిన్‌ను రూపొందించింది. డెలివరీ భాగస్వాములకు నేత్ర, దంత పరీక్షలతో సహ వారికి ఉచిత ఆరోగ్య పరీక్షలను అందించడంతో పాటు, కొనసాగుతున్న వారి సమగ్ర ఆరోగ్యం, మహిళా డెలివరీ భాగస్వాములకు ప్రసూతి కవర్‌తో సహ ప్రమాదవశాత్తు కవరేజ్ గురించి అవగాహన కల్పించడం ఈ క్యాంపెయిన్ లక్ష్యం. డెలివరీ భాగస్వాములకు సురక్షితమైన, సహాయక వాతావరణాన్ని పెంపొందించడంలో అమెజాన్ అంకిత భావాన్ని ఈ బలమైన ప్రయత్నాలు చాటి చెబుతున్నాయి. అమెజాన్ భారతదేశం వ్యాప్తంగా డెలివరీ భాగస్వాములను శక్తివంతం చేస్తూ, వారికి రక్షణ కల్పించడం పట్ల తన తిరుగులేని నిబద్ధతను ప్రదర్శిస్తుంది.

మాక్సివిజన్‌లో ఆధునిక చికిత్సలు : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - విజయవాడ లబ్బీపేట : కంటి చికిత్సలో ఎప్పటికప్పుడు సరికొత్త టెక్నాలజీలు అందుబాటులోకి తీసుకువస్తు ప్రజలకు వైద్యం అందిస్తున్న మాక్సివిజన్ ఐ హాస్పటల్ యాజమాన్యాన్ని అభినందిస్తున్నానని సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు అన్నారు. బందర్ రోడ్డులోని మాక్సివిజన్ ఐ హాస్పటల్ నందు అత్యాధునిక స్మైల్ 500 టెక్నాలజీ సేవలను సోమవారం డాక్టర్ కాసు ప్రసాద్ రెడ్డి, మాక్సివిజన్ గ్రూప్ సిఈఓ వీఎస్ సుదీర్‌లతో కలిసి బోండా ఉమ ప్రారంభించారు. అనంతరం డాక్టర్ కాసు ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ స్మైల్ 500 టెక్నాలజీని ప్రవేశపెట్టడం రెఫ్రాక్టివ్ శస్త్ర చికిత్సలో ఎంతో ముందడుగని, ఖచ్చితత్వంతో పాటు వేగవంతంగా కోలుకునే విధంగా ఈ చికిత్స ప్రత్యేకత అన్నారు. ఈ చికిత్స విధానం ద్వారా రోగులకు మినిమల్ ఇన్వేసివ్ పద్దతిలో స్పష్టమైన దృష్టిని పొందే అవకాశం కల్పిస్తున్నామని, సంప్రదాయ లాసిక్ కంటే చిన్న గాటు ద్వారా శస్త్ర చికత్స చేయడం వలన డ్రై ఐ, ఇతర సమస్యలు తగ్గుతాయని, కార్నియా బలం మరింత కాపాడబడుతుందని తెలిపారు. అద్దాలు, కాంటాక్ట్ లెన్సెస్‌పై ఆధారపడకుండా ఉండాలనుకును వారికి అత్యుత్తమ, సురక్షితమైన శస్త్రచికిత్స పద్దతని తెలిపారు. అనంతరం వి.ఎస్. సుదీర్ మాట్లాడుతూ విజయవాడలోనే అత్యాధునిక రెఫ్రాక్టివ్ శస్త్రచికిత్సలను అందిం చడం ఈ టెక్నాలజీ ద్వారా సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఏ.ఏ.వి.రామలింగ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంగా దేవిగా అమ్మవార్లు

విశాలాంధ్ర అవనిగడ్డ : దేవిశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దివిసీమలోని అమ్మవార్లు గంగా దేవిగా దర్శనం ఇచ్చారు. దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 5 వ రోజు అయిన సోమవారం రాజరాజేశ్వరి సహిత రాజశేఖర స్వామి దేవాలయంలో అమ్మవారిని ఆలయ అర్చకులు ఘంటశాల సంతోష్ పవన్ కుమార్ శర్మ అమ్మవారిని గంగా దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఉదయం, సాయంత్రం విశేష పూజలు అనంతరం కుంకుమ అర్చనలు నిర్వహించగా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని సామూహికంగా లలిత సహస్ర నామ పారాయణం చేశారు. గ్రామదేవతగా వీరాజిల్లుతున్న లంకమ్మ అమ్మవారిని దసరా ఉత్సవాల్లో భాగంగా ఆలయ అర్చకులు గంగా దేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. 5వ వార్డులోని కంచి కామాక్షమ్మ అమ్మవారి ఆలయంలో, 3వ వార్డులోని రామాల యంలో ఏర్పాటు చేసిన అమ్మవారిని, మండల పరిధిలోని వేకనూరులోని మాదివాడ వారి అంకాలమ్మ అమ్మవారిని గంగా దేవిగా, ఉభయ ముక్తేశ్వర స్వామి వారి ఆలయంలో పార్వతి అమ్మవారిని, మోదుమూడి గ్రామంలో ఆదిశేషుని దేవస్థానం వద్ద ఏర్పాటు చేసిన అమ్మవార్లను గంగా దేవిగా అలంకరించి విశేష పూజలు, అర్చనలు నిర్వహించారు. రాజశేఖర స్వామి దేవస్థానం, లంకమ్మ అమ్మవారి ఆలయంలో భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను ఆలయాల కార్యనిర్వాహణాధికారి యార్లగడ్డ శ్రీనివాసరావు స్వయంగా పర్యవేక్షించగా ఆయా ఆలయాల్లో ఉత్సవ కమిటి నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బాల శివశంకర్ భగవాన్‌కు ప్రత్యేక పూజలు

బాలశివశంకర్ భగవాన్‌కు ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించి స్వామి వారిని విశేషంగా అలంకరిం చారు. మండల పరిధిలోని దక్షిణ చిరువోల్లంక మోపిదేవి మండల పరిధిలోని కోసూరువారిపాలెం కృష్ణా నదీ నడుమ వెలసిన బాలశివశంకర భగవాన్‌కు క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరత్ ఋతువు, ఆశ్వీజ మాసం, శుక్లపక్షం, చవితి తిధిని పురస్కరిం చుకుని సోమవారం ఆలయ నిర్వాహకురాలు గుడిసేవ విజయలక్ష్మీ స్వామి వారికి నవవిధ అభిషేకాలు నిర్వహించి విశేషంగా అలంకరించారు. ఆలయ అర్చకులు కాశీభట్ల సుబ్బయ్య శాస్త్రి స్వామి ప్రత్యేక పూజలు, అర్చనలు గోత్రనామాలతో పూజలు నిర్వహించారు.

మిక్‌లో దసరా వేడుక

విశాలాంధ్ర- కంచికచర్ల: స్థానిక స్థానిక మిక్ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీలో దసరా పండుగను పురస్కరించుకొని విద్యార్థిని విద్యార్థులకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ టి. వంశీ కిరణ్ అని తెలిపారు. సహ పాఠ్య, అదనపు పాఠ్య కార్యకలాపాలకు సంబంధించిన (ఐసీఈ) బృందం వారు విద్యార్థిని విద్యార్థులకు బతుకమ్మ, కోలాటం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కళాశాలలో నిర్వహించిన దసరా వేడుకల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల సీఈఓ పాండురంగారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ టి. వంశీ కిరణ్,అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లీడ్ శిక్షా అవార్డుల ప్రదానం

విశాలాంధ్ర -విజయవాడ (వన్‌టౌన్) : ప్రముఖ స్కూల్ ఎడ్‌టెక్ కంపెనీ లీడ్ గ్రూప్ భారతదేశంలోని అతిపెద్ద పాఠశాల అవార్డుల కార్యక్రమాల్లో ఒకటైన శిక్షా అవార్డులను విజయవంతంగా అందించింది. వరుసగా రెండవ సంవత్సరం, లీడ్ గ్రూప్ అందించిన శిక్షా అవార్డులు, భారతదేశంలోని విద్యార్థుల అభ్యాసాన్ని మారుస్తున్న విద్యా నైపుణ్యం పట్ల అచంచలమైన అంకితభావాన్ని కలిగి ఉన్న అసాధారణమైన పాఠశాలలు, పాఠశాల నాయకులను గుర్తించి వేడుక చేశారు. విద్యార్థుల నేతృత్వంలోని సమావేశాలతో సహా అనేక కార్యక్రమాల ద్వారా విద్యార్థుల విద్యలో తల్లిదండ్రుల ప్రమేయాన్ని ఇవి మెరుగుపరుస్తున్నాయని లీడ్ గ్రూప్ సీఈఓ, సహ వ్యవస్థాపకుడు సుమీత్ మెహతా వెల్లడించారు. స్కూల్ లీడర్‌షిప్‌పై మాస్టర్ క్లాస్ కూడా ప్రదర్శించినట్లు తెలియజేశారు.

శీలం ప్రకాశరావును నేతల పరామర్శ

విశాలాంధ్ర-కూచిపూడి : కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం కృష్ణా జిల్లా అధ్యక్షుడు శీలం ప్రకాశరావు సోమవారం మొవ్వలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షుడు యద్దనపూడి మధు, జిల్లా కమిటీ సభ్యుడు బండారు వెంకటేశ్వరరావులు పరామర్శించారు. గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొంది ప్రస్తుతం మొవ్వలోని ఇంటి వద్ద వైద్య సేవలు తీసుకుంటున్న ఆయన ఆరోగ్య స్థితిగతులను కుటుంబ సభ్యుల ద్వారా తెలుసుకొన్నారు.